Visakha
Samacharam
MINI
FUNCTION HALL
100 Seating
Call : 93939 49345

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

హారిక, హాసిని
కేటరింగ్ & కుకింగ్
బ్రాహ్మణ భోజనాలు
అతి తక్కువ ధరలకే లభించును
All Function Catering (Veg) Order Taken
ప్రొప్రైయిటర్ : సంతోష్ కుమార్
Ph : 8985488221
9014911305
పెదగదిలి, సింహగిరి కోలని, విశాఖపట్నం

RNI No.52722/90 సంపుటి : 34 సంచిక : 203 విశాఖపట్నం, 25 మే 2024 శనివారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

## విశాఖ స్టీల్‌ప్లాంట్ పునరుద్ధరణకై జీవీఎల్ విజ్ఞప్తి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు ఆర్థిక సహాయం కోసం పార్లమెంట్లో మరియు వెలుపల తన ప్రయత్నాలను నిరంతరం కొనసాగిస్తున్న సీనియర్ బీజేపీ నాయకులు జీవీఎల్ నరసింహా రావు కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి డాక్టర్ టి.వి. సోమనాథన్‌ను ఈరోజు ఢిల్లీలో కలిసి ఆర్ఐఎన్ఎల్‌ని పునరుద్ధరించ డానికి రూ.3,110 కోట్ల ఆర్థిక సహాయాన్ని కోరారు.

ఆర్థిక కార్యదర్శితో జరిగిన ఈ కీలకమైన సమావేశంలో , సీనియర్ అధికారులతో కూడిన అంతర్-మంత్రిత్వ బృందం ఇటీవల ఆర్ఐఎన్ఎల్ పనితీరుపై వివరణాత్మక సమీక్షను చేపట్టి, ప్రభుత్వానికి తగిన సిఫార్సుల కోసం గల వివిధ అవకాశాలపై చర్చ జరిగింది.

ఆర్థిక మంత్రిత్వ శాఖలోని అత్యంత సీనియర్ అధికారిగా, ఆర్ఐఎన్ఎల్‌కు ఆర్థిక సహాయం కోసం కేంద్ర మంత్రివర్గానికి సిఫార్సులు చేయడంలో ఆర్థిక కార్యదర్శి టి.వి. సోమనాథన్‌ది చాలా ముఖ్యమైన పాత్ర గా ఉండబోతుంది.

ఆర్థిక శాఖ కార్యదర్శికి సమర్పించిన లేఖలో, శ్రీ జీవీఎల్ "విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ గత కొన్ని నెలలుగా ఆర్ఐఎన్ఎల్‌కు వెలుపలి మరియు కంపెనీ నియంత్రణలో లేని ఇతర కారణాల వల్ల చాలా తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో ఉందని, 30,000 మంది ఉద్యోగులు మరియు మొత్తం ఒక లక్ష కుటుంబాలు ఆర్ఐఎన్ఎల్ మనుగడపై ఆధారపడి

(మిగతా 2లో)

## ఆదివారం ఉదయం కమలానంద భారతి స్వామి ప్రసంగం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ప్రఖ్యాత ఆధ్యాత్మిక గురువు, విజయవాడకు చెందిన శ్రీ భువనేశ్వరి పీఠం అధిపతి శ్రీ కమలానంద భారతి స్వామివారు ఆదివారం ఉదయం శంకరమఠంలో గొప్ప ఆధ్యాత్మిక ప్రసంగం చేయబోతున్నట్లు నిర్వహణ కమిటీ ఒక ప్రకటనలో తెలియజేసింది. "దేవాలయం కేంద్రంగా ధార్మిక, సామాజిక కార్యక్రమ నిర్వహణ" అనే అంశంపై దేవాలయాల ద్వారా సమాజానికి జరగవలసిన సేవలు, దేవాలయాలలో ఆచరించవలసిన విధులు, విధానాలు, ఆచారాలు వంటి విషయాలను స్వామివారు విపులీకరిస్తారు.

ప్రైవేట్ దేవాలయాల కమిటీల నిర్వాహకులు, అర్చకులు, ఆధ్యాత్మిక రంగంలో ఉన్నవారిని ఈ కార్యక్రమానికి ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నారు. ఉదయం 9 గంటలకు సభ ప్రారంభమై మధ్యాహ్నం 1 గంటకు ముగుస్తుంది.

## బ్రేక్ దర్శనాలు రద్దు

**తిరుపతి, (విశాఖ సమాచారమ్):** తిరుమలలో భక్తుల అధిక రద్దీ జూన్ 30 వరకు శుక్ర, శని, ఆది వారాలలో వి.ఐ.పి బ్రేక్ దర్శనాలు రద్దు.

వేసవి సెలవులు ముఖ్యంగా ఎలక్షన్లు పూర్తికావడం, విద్యార్థుల పరీక్షల ఫలితాలు విడుదలైన నేపథ్యంలో, తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతున్నది. ముఖ్యంగా, శుక్ర, శని, ఆదివారాలలో సామాన్య భక్తుల రద్దీ వలన, వారు దర్శనానికి సుమారు 30,40 గంటల సమయం వరకు క్యూ లైన్లలో వేచి ఉండాల్సిన పరిస్థితి వుంది. సామాన్య భక్తులకు త్వరిత గతిన శ్రీవారి దర్శనం కల్పించేందుకుగాను, జూన్ 30వ తేదీ వరకు శుక్ర శని, ఆది వారాలలో బ్రేక్ దర్శనం రద్దు చేయబడినది. ఇందుకుగాను, సిఫార్సు లేఖలు స్వీకరించబడవు. ఈ మార్పును గమనించి భక్తులు టి.టి.డికి సహకరించవలసినదిగా విజ్ఞప్తి చేయడమైనది.

## యువతను ప్రోత్సహించేందుకు ఏయూలో నూతన పథకం




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** యువతలో ఉన్న కళప్రతిభను ప్రోత్సహిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా యువతను ప్రోత్సహించే విధంగా నక్షత్ర ద స్టార్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి తెలిపారు. శుక్రవారం ఏయూ పూర్వవిద్యార్థుల సంఘం సమావేశ మందిరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కార్యక్రమ వివరాలతో కూడిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ మానవ సంబంధాలను బలోపేతం చేయడానికి కళలు ఎంతగానో దోహదపడతా యన్నారు. ఈ దిశగా యువతను నడిపించడానికి, వారిలోని ప్రతిభను ప్రోత్సహించడానికి తొలి ప్రయత్నంగా దీనిని చేపడుతున్నామన్నారు. ఫైనల్ కార్యక్రమాన్ని విశాఖలో నిర్వహిస్తామన్నారు.

ఏయూ ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ.నరసింహా రావు మాట్లాడుతూ ఎంటర్‌టైన్‌మెంట్ క్యూబ్ నెట్ వర్క్స్ సంస్థతో సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. జూనియర్, సీనియర్‌గా రెండు విభాగాలుగా, మూడు అంశాలు మ్యూజిక్, డాన్స్, ఆర్ట్స్‌లో పోటీలు జరుగుతాయన్నారు. ఎటువంటి ప్రవేశ రుసుము లేకుండా, అన్ని వయసుల వారు ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నామన్నారు.

కార్యక్రమం నిర్వాహకులు, నటుడు షాహిద్ అబ్దుల్ మాట్లాడుతూ ఏపి, తెలంగాణ రాష్ట్రాలలో దీనిని నిర్వహిస్తున్నామని ఏపీలో జూన్ 15 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ అనుమతిస్తామని, తెలంగాణకు జూన్ 17 వరకు రిజిస్ట్రేషన్‌లు ఆన్‌లైన్‌లో జరుపుతామన్నారు. రెండు దశల్లో ప్రతిభను గుర్తించి, విజేతలుగా నిలచిన వారికి ఫైనల్‌లో పాల్గొనే అవకాశం కల్పిస్తామన్నారు. పూర్తి వివరాలకు ద స్టార్ ఆఫ్ ఇండియా ఇన్‌స్టా పేజ్‌ను సందర్శించాలని సూచించారు. ఫైనల్ పోటీలకు న్యాయనిర్ణేతలుగా సంగీత దర్శకుడు రఘు కుంచె హాజరవుతారు. అరుదైన గ్రామీణ కళలను సైతం వెలికితీసి ప్రోత్సహించడం కార్యక్రమం లక్ష్యమన్నారు.

విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఎన్.విజయ్ మోహన్ మాట్లాడుతూ తెలుగు

(మిగతా 2లో)

## కేదార్‌నాథ్‌లో హెలికాప్టర్ హడావుడి



ప్రయాణికులతో కూడిన హెలికాప్టర్ సేఫ్ ల్యాండింగ్ సమయంలో నియంత్రణ కోల్పోయింది. ఏదైనా ప్రమాదం జరుగు తుందేమోనని భయపడిన ప్రజలు పరుగులు తీశారు. అప్రమత్తమైన పైలట్ హెలి ప్యాడ్ ప్రాంతంలో కాకుండా దాని పక్కనున్న కొండచరియల్లో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేయడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.



## ఆహ్వానం

ప్రఖ్యాత ఆధ్యాత్మిక గురువులు, విజయవాడ దరి గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలో వేంచేసియున్న భువనేశ్వరీ పీఠం యొక్క పీఠాధిపతులు **శ్రీ శ్రీ శ్రీ కమలానంద భారతి స్వామి** వారు ఈ నెల 26వ తేదీ ఆదివారం ఉదయం విశాఖ నగరంలోని శంకర మఠం ఏసీ హాలు నందు అద్భుతమైన ప్రసంగం చేయనున్నారు.

### విషయం

దేవాలయం కేంద్రంగా ధార్మిక, సామాజిక కార్యక్రమాల నిర్వహణ.

ఈ సందర్భంగా శ్రీ స్వామి వారు దేవాలయాల లో ఆచరించవలసిన విధులు, విధానాలు, ఆచారాలు వంటి విలువైన విషయాలు వివరిస్తారు. ఆధ్యాత్మిక రంగంలో ఉన్న వారికి ఉపయోగపడే అనేక విశేషాలు స్వామి వారిని అడిగి తెలుసుకోవచ్చు.

**దేవాలయ నిర్వహణ కమిటీలవారు, అర్చకులు, ఆధ్యాత్మిక రంగంలో ఉన్న వారికి మా ప్రత్యేక ఆహ్వానం.**

### కార్యక్రమ వివరాలు:

**తేదీ 26-5-2024. ఆదివారం**

వేదిక: శ్రీ శంకర మఠం
ద్వారకా నగర్, విశాఖపట్నం.
సభ ప్రారంభం: ఉదయం 9 గంటలకు.
ప్రశ్నోత్తరాలు: 12 గంటలకు.
**శ్రీ స్వామి వారికి పౌర సన్మానం: 12.30 లకు.**
వివరములకు: శ్రీ కమలానంద భారతి స్వామి
వారి భక్త బృందం, విశాఖపట్నం.
ఫోన్: 93939 49345.

## (మొదటి పేజీ తరువాయిలు)

### విశాఖ స్టీల్‌ప్లాంట్ పునరుద్ధరణకై జీవీఎల్ విజ్ఞప్తి

ఉన్నాయనీ, అందువలన ఈ విలువైన జాతీయ సంస్థను రక్షించడం కూడా చాలా ముఖ్యం." అని పేర్కొన్నారు.

ఆర్ఐఎన్ఎల్ గురించి తాను పార్లమెంటులో మరియు వెలుపల తాను పలు ప్రయత్నాలు చేశానని పేర్కొంటూ, ప్రస్తుత ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించడానికి ఆర్ఐఎన్ఎల్‌కు రూ.3,110 కోట్ల సహాయాన్ని ప్రాధాన్యత షేర్ల రూపంలో ఇవ్వాలని జీవీఎల్ కేంద్ర ఆర్థిక కార్యదర్శిని కోరారు.

"ప్రస్తుతం, ఆర్ఐఎన్ఎల్ యొక్క అధీకృత వాటా మూలధనం రూ. 8,000 కోట్లు మరియు చెల్లించిన మూలధనం రూ.4,889.85 కోట్లు అని మిగిలిన రూ.3,110 కోట్లను ప్రిఫరెన్షియల్ షేర్ల రూపంలో అందించడం ద్వారా ఆర్ఐఎన్ఎల్‌కు సానుకూల నికర విలువను తిరిగి పొందేందుకు సహాయం చేయవచ్చు" అని జీవీఎల్ పేర్కొన్నారు.

2002లో ఆర్ఐఎన్ఎల్‌కు అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వం అందించిన మద్దతును శ్రీ జీవీఎల్ గుర్తుచేస్తూ, ఆర్ఐఎన్ఎల్ 2011-2016 మధ్య కేంద్ర ప్రభుత్వానికి రూ.2,937 కోట్లు తిరిగి చెల్లించినదని అని కూడా తెలియజేసారు.

ఆర్థిక సహాయాన్ని అందించడంతో పాటు, ఆర్ఐఎన్ఎల్ పునరుద్ధరణ కోసం అనేక ఇతర చర్యలను చేపట్టాలని ఆర్థిక కార్యదర్శిని జీవీఎల్ కోరారు.

ఆర్ఐఎన్ఎల్ నికర విలువను మెరుగుపరచడానికి ఆర్ఐఎన్ఎల్‌కు భూమి యాజమాన్యాన్ని బదలాయించడం మరియు ఆర్ఐఎన్ఎల్‌ను వివిధ ఇతర వనరుల ద్వారా అదనంగా రూ.4,000 కోట్లను సమకూర్చుకొనేందుకు అనుమతించడం గురించి కూడా చర్చించినట్లు సమావేశం అనంతరం జీవీఎల్ తెలియచేశారు. అటువంటి సమగ్ర ప్రతిపాదనలు ఆర్ఐఎన్ఎల్‌ని మళ్లీ ఆర్థికంగా పరిపుష్టం చేయడానికి సహాయపడతాయని జీవీఎల్ పేర్కొన్నారు.

ఈ ప్రతిపాదనలన్నింటినీ సానుకూలంగా పరిశీలిస్తామని కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి టివి సోమనాథన్ హామీ ఇచ్చారని బిజెపి నేత జీవీఎల్ తెలిపారు.

### యువతను ప్రోత్సహించేందుకు ఏయూలో నూతన పథకం

రాష్ట్రాలలో టాంలెంట్ హంట్ చేసే విధంగా నక్షత్ర ద స్టార్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. కళలకు నిలయంగా నిలిచే ఏయూ దీనిలో భాగమవుతుందని చెప్పారు.

# అప్పన్నకు ద్వితీయ చందన సమర్పణ



**సింహాచలం, (విశాఖ సమాచారమ్):** వరాహ, నృసింహ అవతారాల కలయికతో అద్వితీయ మూర్తిగా సింహగిరిపై కొలువైన శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామికి వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం రెండో విడత చందన సమర్పణ సంప్రదాయబద్ధంగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు.

అంతరాలయంలో స్వామి చెంతన విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం పూజలు జరిపారు. సుగంధ ద్రవ్యాలు మిళితం చేసి ముందుగా సిద్ధం చేసిన మూడు మణుగుల (125 కిలోలు) శ్రీగంధాన్ని వేదమంత్రోచ్ఛారణల నడుమ స్వామికి అలంకరించారు. అనంతరం ధూపదీప నైవేద్యాలతో శీతలోపచారాలు సమర్పించారు. రెండో విడత చందన సమర్పణతో స్వామి ద్విగుణీకృత పరిమాణంలో భక్తులకు దర్శనమిచ్చారు.

వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని స్వామి వారికి వైశాఖ స్నపన తిరుమంజనం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామి, అమ్మవార్లు, ఆళ్వారాచార్యులను ఆలయ ఆస్థాన మండపంలోని వెండి సింహాసనంపై కొలువుదీర్చారు. విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం పూజలు జరిపారు. పంచామృతాలు, ఫలోదకాలు, సుగంధ ద్రవ్యాలతో దేవతామూర్తులకు విశేష స్నపనం నిర్వహించారు. గోవిందరాజ స్వామిని చందనంతో అలంకరించి శీతల నివేదనలు సమర్పించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ నేతృత్వంలో అర్చక పరివారం వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈవో సింగల శ్రీనివాసమూర్తి దంపతులు, లక్ష్మీకాంత నాయకో దాసుడు తిరుమంజనంలో పాల్గొని స్వామిని సేవించారు.

# నగరంలో గోడలపై పోస్టర్లు అతికిస్తే చర్యలు తప్పవు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** అతి సుందర నగరంగా కీర్తించబడుతున్న మహా విశాఖ నగరంలో నగర గోడలపై, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్లపై, రోడ్డు విభాగినిలపై, డస్ట్ బిన్నులపై, ప్రజా ఆస్తులపై పోస్టర్లు అతికించినా, పెయింటింగ్ లు, ఇతర వ్రాతలు వ్రాసినట్లయితే, సంబంధిత సంస్థలు, ఆర్గనైజేషన్ లపై ప్రజా ఆస్తులకు భంగం వాటిల్లుతున్న దృష్ట్యా జీవీఎంసీ తగు చర్యలు చేపడుతుందని జివిఎంసి చీఫ్ సిటీ ప్లానర్ సురేష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ కమిషనర్ సీఎం.సాయికాంత్ వర్మ ఆదేశాల మేరకు జివిఎంసి ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో విశాఖ నగరంలోని ప్రింటింగ్ ప్రెస్ అసోసియేషన్ సభ్యులు, మత సంబంధ సంస్థలు, ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూట్ సభ్యులతో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా చీఫ్ సిటీ ప్లానర్ మాట్లాడుతూ ప్రపంచ దేశాలు సైతం విశాఖ నగరాన్ని సుందర నగరంగా, పరిశుభ్ర నగరంగా ఇతర నగరాలకు సూచిస్తుందని, విశాఖ నగరానికి నిత్యం సందర్శకులు, పర్యాటకులు సందర్శిస్తున్నారని, జీవీఎంసీ కోట్లాది రూపాయలు వెచ్చించి నగర సుందరీకరణ పనులను చేపట్టి నగరాన్ని ఆకర్షణీయంగా జీవీఎంసీ తీర్చిదిద్దుతోందన్నారు. నగరంలో పలువురు విచ్చలవిడిగా గోడలపై, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్లపై, రోడ్డు విభాగినిలపై, డస్ట్ బిన్నులపై, ప్రజా ఆస్తులపై వ్యాపార సంబంధిత, మత సంబంధిత, వినోద సంబంధిత సంస్థలు పోస్టర్లు అతికిస్తూ, పెయింటింగులు,రాతలు వ్రాసి, అనధికారిక హెూర్డింగులు, ఫ్లెక్సీలు, డిజిటల్ బ్యానర్లతో నగరాన్ని అశుభ్రపరుస్తున్నారన్నారు. నగరంలో ఎలక్ట్రికల్ ఫోల్స్ పై సెప్టిక్ క్లీనర్ ఫోన్ నెంబర్లు అసహ్యంగా రాసి ఉంటున్నాయని వాటిని నిరోధించవలసిన అవసరం ఉందన్నారు. 1997 యాక్ట్ ప్రకారం నగర సుందరీకరణకు ఆటంకం కలిగించే వారిపై చర్యలు తీసుకుంటామని, అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం 1 లక్ష రూపాయలు వరకు జరిమానా విధించబడునని సిసిపి తెలిపారు.

నగరంలో వ్యాపార, విందు, వినోద, మత సంబంధిత ప్రకటనలకు, ప్రచారాలకు ప్రత్యామ్నాయంగా ఎఫ్ఎం రేడియోలు, కేబుల్ టీవీలు, ప్రైవేట్ ఏజెన్సీల హెూర్డింగులు, సినీ స్లైడ్స్, వార్తాపత్రికలు, సోషల్ మీడియా ద్వారా ప్రకటనలను చేసుకునేందుకే ఈ అవగాహన కార్యక్రమం చేపట్టడం జరిగిందని సిసిపి తెలిపారు.

విశాఖ నగర పరిశుభ్రత, సుందరీకరణ దృష్ట్యా, తమ వంతు బాధ్యతగా ప్రింటింగ్ ప్రెస్ ఆర్గనైజేషన్స్, విద్యాసంస్థలు, మతపరమైన సంస్థలు, ఇతర వ్యాపార సంస్థల యాజమాన్యాలు ఇటువంటి పోస్టర్లు అతికించకుండా వ్రాతలు వ్రాయడం, అనధికారిక హోర్డింగ్లు, బేనర్లు ప్రదర్శించకుండా విశాఖ నగర అభివృద్ధికి సహకరించాలని సిసిపి వారికి విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా పోస్టర్లు ప్రింట్ చేసేవారు వారి ఫోన్ నెంబర్లు సంస్థ పేర్లు తప్పనిసరిగా పోస్టర్లో పొందుపరచాలని సూచించారు.

ఈ సమావేశం లో సిపి దొర, డిసిపి పద్మజ, డిసిపిలుఎసిపి లు, టిపిఒ లు, వార్డు ప్లానింగు సెక్రటరీ లు, తదితరులు పాల్గొన్నారు.

### అనకాపల్లి జిల్లాలో తృటిలో తప్పిన ఘోర రోడ్డు ప్రమాదం

నక్కపల్లి మండలం, ఉద్దండపురం వద్ద జాతీయ రహదారిపై ప్రమాదం. ముందు వెళ్తున్న కంటైనర్ ను ఢీకొట్టిన ప్రవేటు ట్రావెల్ బస్సు. బస్సు వెనకాల వస్తూ బస్సును ఢీకొన్న లారీ. బస్సుకు ముందు వెనక నుజ్జు అయిన బస్సు బస్సులో 36 మంది ప్రయాణికులు. ప్రయా ణికులు అందరూ సురక్షితం. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు.

## జిల్లా వ్యాప్తంగా 14 కేంద్రాల్లో నేడు డిప్యూటీ డీఈవో పరీక్ష

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో డిప్యూటీ డీఈవో పరీక్ష శనివారం జిల్లా వ్యాప్తంగా 14 కేంద్రాల్లో జరుగుతుందని, మొత్తం 4,498 మంది అభ్యర్థులు హాజరవుతున్నారని జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్ పేర్కొన్నారు. ఉదయం 9.00 నుంచి 11.30 గంటల వరకు పరీక్ష జరుగుతందని, పటిష్ట ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్ ఆదేశించారు. ఈ మేరకు శు క్రవారం తన ఛాంబర్లో వివిధ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఎక్కడా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షను నిర్వహించాలని చెప్పారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయం వహించాలని, ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి ప్రశాంత వాతావరణంలో పరీక్ష జరిగేందుకు పోలీసు సిబ్బంది చర్యలు తీసుకోవాలని చెప్పారు. అభ్యర్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని, ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకురాకూడదని సమావేశంలో భాగంగా జిల్లా రెవెన్యూ అధికారి సూచించారు.

సమావేశంలో ఎగ్జామినేషన్ సూపరింటెండెంట్ రవి, ఏపీపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్లు, లైజన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పరుగులు పెట్టినా ఫలితం దక్కలే



తూ.కో రైల్వే విశాఖ రైలు నిలయంలో అధికారుల వింత చర్యలతో ప్రయాణికులకు వెతలు తప్పడం లేదు. ప్లాట్‌ఫామ్‌ల కొరత నెపంతో విశాఖ నుంచి రెండు వేర్వేరు ప్రాంతాలకు వెళ్లాల్సిన రైళ్లను ఒకే సమయంలో ఒక దాని వెనక మరొకటి ఉంచడంతో ప్రయాణికులు గందరగోళానికి గురవుతున్నారు. ముందుగా వెళ్లాల్సిన విశాఖ- భువనేశ్వర్ ఇంటర్ సిటీ ఏడో నంబర్ ప్లాట్‌ఫామ్‌కు ముందు వైపు ఉంచగా విశాఖ నుంచి దుర్గ్ వెళ్లాల్సిన రైలు బోగీలను దాని వెనుకనే నిలుపుతున్నారు. ఇంటర్ సిటీ రైలు సమాచారం ప్రకటనలో రైలు ముందు వైపు ఉందని ప్రకటిస్తున్నా వంతెన దిగిన వెంటనే కనిపిస్తున్న రైలు బోగీల్లోకి ప్రయాణికులు వెళ్లిపోతున్నారు. ఆ తర్వాత ప్రయాణించాల్సిన రైలు ఇది కాదని తెలుసుకొని పరుగులు తీయడం ప్రారంభిస్తున్నారు. ఈ క్రమంలో చాలా మంది తాము ఎక్కాల్సిన రైలు తప్పడంతో ఉసూరుమంటూ వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. రెండు రైళ్లకు రద్దీ తీవ్రంగా ఉండటంతో పలువురు ప్రయాణికులు తికమక చెందాల్సిన దుస్థితి నెలకొంటోంది. నిత్యం ఇదే తంతు ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం



**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** యలమంచిలి మండలం రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సింహాచలం ఇచ్చిన సమాచారం మేరకు యలమంచిలి రూరల్ పోలీస్ స్టేషన్ పరిది లో గల కొక్కిరాపల్లి గ్రామ శివారు లో గల తురంగల పాలెం పోవు రోడ్డు ప్రక్కన సుమారు గా 3, 4 రోజుల క్రితం ఊరు , పేరు తెలియని సుమరు 30 నుండి 35 సం,, మద్య వయస్సు గల పురుషుడు చోడి చెరువు లో పడి మునిగి పోయి చనిపోయి ఉన్నాడు కావున మీ గ్రామం లోఈ మధ్య కాలం లో మిస్సింగ్ అయి ఉన్నట్లు అయితే పై ఫోటో లో గల పురుషుడు శవం ను గుర్తించి యలమంచిలి సర్కిల్ ఇన్స్పెక్టర్ గార్కి తెలియ పర్చగలరని కోరారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** 32/11 కెవి యలమంచిలి సబ్ స్టేషన్ పరిధిలో 11 కెవి రాంబిల్లి రూరల్ ఫీడర్ కు సంబంధించి లైన్ నిర్వహణ పనులు, మరమ్మత్తుల నిమిత్తం నేడు ఉదయం 8 గం.ల నుంచి 2 గంటల వరకు, సోమలింగపాలెం,కట్టుపాలెం, రామా రాయుడు పాలెం గ్రామాలతో పాటుగా యలమంచిలి, యర్రవరం, కొత్తపాలెం వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు విద్యుత్ అధికారి ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రాజశేఖర్ శుక్రవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేసే ప్రదేశాలలో అవకాశం ఉన్న చోట ప్రత్యామ్యాయంగా ఉదయం 5 గం.ల నుండి 8గం.ల వరకు అలాగే మధ్యాహ్నం 2 గం.నుండి 6 గం.ల వరకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి

| | |
|---|---|
| శనివారం 25-05-2024 | |
| క్రోధి నామ సంవత్సరము | |
| ఉత్తరాయణం, వసంతరుతువు | |
| వైశాఖమాసం | |
| తిథి | : బ. విదియ సా. 06.31 |
| నక్షత్రం | : జ్యేష్ఠ ఉ. 10.37 |
| వర్జ్యం | : లేదు |

## పాలిటెక్నిక్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** భీమిలి ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో వివిధ కంపెనీ లు శు క్రవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. దీనిలో పాల్గొన్న విద్యార్థినులలో 130 మంది ఎంపికయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీ కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం లో టిసిఎస్,మెగా ఇంజనీరింగ్ కంపెనీ,డైకిన్, కోకోకోలా,హెచ్ఎంఐఈఎస్ తదితర కంపెనీ లు ఎంపికలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన భీమిలి జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి విద్యార్థినులకు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎంఐఈ ఎస్ సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి దినకర్ హీరావత్,మానవ వనరుల నిర్వహణ అధికారి బంగార్రాజు,కళాశాల శాఖాధిపతులు, తల్లి తండ్రులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భం గా కళాశాల ప్రిన్సిపాల్ మురళీ కృష్ణ మాట్లాడుతూ కళాశాల లో చదువుతున్న తృతీయ సంవత్సర విద్యార్థినులు అతి చిన్న వయస్సులోనే ఉద్యోగాలు పొందడం అభినందనీయం అని ఆయన అన్నారు. విద్యార్థినులు ముందుకు సాగుతు విజయ తీరాలకు చేరాలని ఆయన కోరారు.

## ముగిసిన విద్యార్థుల వ్యక్తిత్వ యోగ శిక్షణ తరగతులు




**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** వేసవి శెలవుల్లో విద్యార్థులకు రెండు విడతలుగా నిర్వహించిన వ్యక్తిత్వం యోగా శిక్షణ తరగతులు శుక్రవారం ముగిసాయి. స్థానిక కృష్ణా కోలనీ వద్ద గల యోగా చైతన్య సంస్థ కేంద్రం లో విద్యార్థులకు మే 1 నుండి 10 వ తేదీ వరకు అలాగే మే 16 నుండి 25 వ తేదీ వరకు రెండు విడతలు గా ఉచిత యోగ శిక్షణ తరగతులు నిర్వహించబడ్డాయి.దీనిలో 9 సంవత్సరముల నుండి 14 సంవత్సరాల వయస్సు గల బాల బాలికలు సుమారు 348 మంది పాల్గొన్నారు. ఈ సందర్భం గా నిర్వాహకులు మాట్లాడుతూ విద్యార్థులకుఆసనాలు, ప్రాణాయామం, ఏకాగ్రత లతో పాటు భగవద్గీత సాధన అభ్యాసనము లు వంటి వాటి పై శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమం లో సంస్థ నిర్వాహకులు సిహెచ్ వెంకట రమణ,ఎల్ కాళిదాసు వెంకట రంగారావు ( ఆనందవనం భీమిలి), భీమిలి జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, డి శ్రీనివాసరావు, డి నాగిరెడ్డి, ఎం రాజబాబు ఆచార్య డి వెంకట రావు తదితరులు పాల్గొన్నారు.




# విశాఖ సమాచారమ్

శనివారం 25-05-2024


## మిత్రలాభం

జీవితం లో కష్టాలు సుఖాలు రెండూ పంచుకునే మంచి మిత్రులు దొరకడం చాలా కష్టం.

**1.ధర్మం తెలిసిన బ్రాహ్మణుడు రావణుడు**.అపారమైన శివ భక్తుడు. అయినా పరకాంతల యందు..పరుల సొమ్ము నందు వాంఛను చంపుకోలేకపోయాడు. చివరకు రాముని ఒక్క బాణం తో పది తలలు కూలి మట్టిలో కలిసిపోయాడు. ధర్మ మూర్తి అయిన శ్రీ రాముని పాదాలను పట్టి ఆశ్రయించి ఆయన బాట యందు నడిచిన "స్వామి హనుమ" చిరంజీవి గా మిగిలిపోయారు. చరిత్రలో నిలిచిపోయారు.

"జీవితం లో ఏదైనా సాధించాలి అని అనుకున్నప్పుడు దేన్ని పట్టుకోవాలో. దేన్ని విడిచిపెట్టలో తెలియాలి. సరైన మార్గాన్ని తెలుసుకోవాలి. తెలియడం కాదు పాటించే దమ్ము కూడా ఉండాలి."

**2. మైత్రి యొక్క విలువ!**

వంచన తో..బలం తో..భార్యను, భూమిని, బలగాన్ని తనవైపు తిప్పుకున్న వాలి కి మంత్రిగా హనుమ ఒక్క నాటికి లేరు.తన దారి తానూ చూసుకోలేదు. న్యాయం వైపు గా..సుగ్రీవుడి పక్షాన్నే నిలిచి ఉన్నారు.

"జీవితం లో కష్టాలు సుఖాలు రెండూ పంచుకునే మంచి మిత్రులు దొరకడం చాలా కష్టం. నిజంగా అలాంటి వాళ్ళు దొరికినప్పుడు వాళ్ళని ఎన్ని కాష్టాలొచ్చినా విడిచిపెట్టకండి."

**3. అహం బ్రహ్మాస్మి**

నేనే గొప్ప అని అనకు!

నాదేం లేదు అనగలిగే గొప్ప స్వభావం కలిగి ఉండాలి!

లంకకు వెళ్ళే ముందు హనుమ ఇలా అంటారు..!

నేను తలచుకుంటే నా శరీరాన్ని అమాంతం పెంచి వంగి ఒక్క చేత్తో అవతలి లంకా తీరాన్ని అందుకో గలను అంత బలం ఉంది

కాని నేను ఎలా వెళ్తానో తెలుసా?

"నా స్వామి రామ చంద్రమూర్తి యొక్క కుడిచేత్తో తన భుజం వెనుకనున్న అక్షయ బాణ తూనీరం లో నుండి తీసిన బాణాన్ని తన ఎడమ చేతిలోనున్న బంగారు వింటినారికి సంధించి ఆకర్ణాంతం లాగి విడిచిపెడితే ఆ బాణం ఎలా వెళుతుందో " అలా దూసుకెళతాను

అది నా శక్తి కాదు! రాముడి చే విడవబడితే రాముడి శక్తి ఆ బాణం లో కెళ్ళి బాణం వెళుతుంది! అటువంటి రామ బాణం లా వెళతాను!"

నేను నా వల్ల, నా బలం..ఇదంతా నేనె చేసాను.. అని హనుమ ఒక్క సారి కూడా అనలేదు!

**4. నీ మీద నమ్మకం ఉండేలా బ్రతుకు!**

కొన్ని లక్షల వానర సేన! నూరు యోజనముల సముద్రం! జాంబవంతుడు సహా ఎందరో అతిరథ మహారథులు! తలచుకుంటే కాని పని కాదు! కాని రాముడు నమ్మింది అందరూ సూచించింది "హనుమనే"!

"నిన్ను నమ్మి పని అప్పగించి. గుండెల పై చెయ్యేసుకుని హాయిగా నిద్రపోయేలా బ్రతుకు!"

**5. మోసం చేసేవాళ్ళు ఉంటారు.** నువ్వు మోసపోకు ఆగిపోకు..ముందుకు మరో అడుగేసి సాగిపో!

హనుమ సముద్రం దాటుతూ ఉండగా ఒక అందమైన బంగారు పర్వతం పైకి లేచింది!"స్వామి మీరు చాలా దూరం ప్రయాణం చేసి అలసి ఉన్నట్టు కనబడుతున్నారు..!కాసేపు నా ఈ పర్వతం పై కూర్చుని విస్రాంతి తీసుకుని, ఇక్కడ ఉన్న పళ్ళు కాయలు తినివెళ్ళండి "అని అంటుంది.

హనుమ "సముద్రం లో బంగారు పర్వతమా? మాయ లా ఉంది? ఇది నాకు విఘ్నమని" ఆలోచించి ఆ పర్వతాన్ని చేత్తో ప్రేమగా తాకి, లంకా నగరం వైపుగా వెళ్ళిపోయారు.

"చేసే పనిలో గమ్యాన్ని చేరుకోడం లో..ఎలాంటి అడ్డంకులున్నా ప్రయాణం ఆపకూడదని హనుమ చేసుకున్న ప్రమాణం."

**6. లక్ష్యం తప్ప మరేదీ కనబడకూడదు.**

హనుమ,లంకలో సీతమ్మకోసం వెతుక్కుంటూ రావణ అసురుని అంత: మందిరం లోనికి ప్రవేశించగా కొన్ని వందల మంది స్త్రీలు వివస్త్రలు గా, సురా పానం చేసి మత్తులో ఒకరిపై ఒకరు పడి అడ్డదిడ్డంగా పడి ఉన్నారు లెక్కలేనన్ని పళ్ళు మధుర పానియాలు నేలపై పడి పారుతూ ఉన్నాయి. వారి ఒంటి మీద బంగారు నగలు నేలంతా పడి ఉన్నాయి ఇవన్నీ చూస్తున్నా.. హనుమ ఒక్కింత కూడా చలించలేదు ఆతని మనసులో ఉన్నది ఒక్కటే!నా తల్లి సీతమ్మ ఎక్కడ ఉందొ? ఎన్ని కస్టాలు పడుతోందో అని!

మురుగు కాలువ దాటినట్టు ఆ స్థలాన్ని దాటి సీతమ్మ ను వెతుక్కుంటూ వెళ్లాడు హనుమ.

"లక్ష్యం సాధించడం లో గురి చేసే పని లో పట్టుదల.. పడే శ్రమలో తపన ఉంటె .మన చుట్టూ ఏమున్నా కనపడవు."

**7. పెద్దరికాన్ని గౌరవించు**

రావణుడు హనుమను బంధించి తీసుకు రమ్మన్నపుడు ఎన్నో విధాలుగా ప్రయత్నించి చివరగా బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగిస్తారు. నిజానికి బ్రహ్మాస్త్రం హనుమను ఆపలేదు.హనుమ బ్రహ్మాస్త్రాన్ని గౌరవించి కట్టు బడ్డాడు!

రావణ సభలో అంతే సులువు గా ఆ తాళ్లను విడిపించుకున్నాడు.

"పెద్దలకి నువ్విచ్చే గౌరవం నలుగురిలో నీ గౌరవాన్నే పెంచుతుంది"

## కౌంటింగ్ సిబ్బందికి తొలి విడత ర్యాండమైజేషన్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** సార్వత్రిక ఎన్నికల పోలింగ్ పూర్తయిన నేపథ్యంలో జూన్ 04వ తేదీన జరగనున్న కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణకు అవసరమైన సిబ్బందిని కేటాయిస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.ఎ. మల్లికార్జున నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు కలెక్టరేట్ వీసీ హాలులో జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్, వీఎంఆర్డీఏ జేసీ, ఎన్.ఐ.సి. అధికారులతో కలిసి శుక్రవారం ఉదయం తొలి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. విశాఖ పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్లు లెక్కించేందుకు, పర్యవేక్షించేందుకు గాను కౌంటింగ్ సూపర్ వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్ సూపర్ వైజర్లు, మైక్రో అబ్జర్వర్లు కలిపి 997 మంది అవసరం కాగా రిజర్వ్ సిబ్బందిని కూడా కేటాయిస్తూ మొత్తం 1,022 మందికి సంబంధించి ర్యాండమైజేషన్ నిర్వహించారు. వారి లో కౌంటింగ్ సూపర్ వైజర్లు 312 మంది ఉండగా, కౌంటింగ్ అసిస్టెంట్ సూపర్ వైజర్లు 357 మంది, మైక్రో అబ్జర్వర్లు 328 మంది ఉన్నారు.

## అనకాపల్లిలో చిరుజల్లులు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** వేసవి ఎండలకు తోడు ఉక్క పూతతో సతమతమవుతున్న పట్టణ ప్రజలకు శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో కురిసిన చిరుజల్లులు ఉపశమనం కలిగించాయి. రెండు గంటల పాటు కురిసిన ఓ మోస్తారు వర్షానికి వీచిన చల్లగాలులకు పట్టణవాసులు సేద తీరారు.

## సముద్రం లో మునిగిపోతున్న వ్యక్తిని కాపాడిన ఫోటోగ్రాఫర్స్





**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** భీమిలి బీచ్ ప్రాంత సముద్రం లో కొట్టుకొనిపోతున్న ఓ వ్యక్తిని భీమిలి బీచ్ ఫోటో గ్రాఫర్స్ రక్షణించిన వైనమిది. భవానీ ప్రసాద్(16) అనే యువకుడుఈ నెల 15 న భీమిలి దగ్గర సముద్రం లో స్నానం చేసేందుకు వెళ్ళాడు. అయితే అతడు సముద్రం లో మునిగిపోతున్న విషయం తెలుసుకొన్న బీచ్ లోనే ఉన్న ఫోటోగ్రాఫర్స్ ( భీమిలి బీచ్) కొక్కిరి పోతన్న, కాసరపు చిన్న, పైడి రాజు లు వెంటనే సముద్రం లోకి వెళ్లి కొనఊపిరి తో ఉన్న ప్రసాద్ ను ఒడ్డుకు తీసుకువచ్చి తక్షణమే ప్రధమ చికిత్స చేసారు. తరువాత స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళ్ళి మెరుగైన చికిత్స అందజేయడం తో ప్రసాద్ ప్రాణాపాయ స్థితి నుండి బయటపడ్డాడు.

**ఫోటోగ్రాఫర్స్ కు సత్కారం :** విషయం తెలుసుకొన్న అసోసియేషన్ ఆఫ్ పీపుల్ పవర్ సభ్యులు శుక్రవారంస్థానిక బీచ్ వద్ద రక్షించిన ఫోటో గ్రాఫర్స్ ను అభినందిస్తూ వారిని ఘనం గా సత్కరించి నగదు బహుమతిని అందజేశారు . కార్యక్రమం లో సభ్యులు నిమ్మకాయల భాస్కర్, కేదార్ శెట్టి, శివగోపినాధ్, అరవింద్, సురేష్, విక్టరీ తేజ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భం గా సభ్యులు మాట్లాడుతూ దురదృష్టవసాత్తు ఆ యువకుడు మరణిస్తే ఆ కుటుంబం పడే వేదనను ఎవ్వరూ పూడ్చలేరని, అటువంటిది ఫోటో గ్రాఫర్స్ అ యువకుడిని రక్షించి పునర్జన్మ ను ఈయడం చాలా గొప్ప విషయం అని అన్నారు.

## ఏపీ సెట్ ఫలితాలు విడుదల



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** అసిస్టెంట్ ప్రొఫెసర్లు, డిగ్రీ కళాశాలల లెక్చరర్ల పోస్టులకు అర్హత కోసం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అర్హత పరీక్ష(ఏపీ సెట్)-2024 ఫలితాలు విడుదలయ్యాయి. ఏప్రిల్ 28న రాష్ట్రవ్యాప్తంగా ఈ పరీక్ష నిర్వహించగా.. శుక్రవారం మధ్యాహ్నం ఫలితాలను విడుదల చేశారు. అర్హత సాధించిన అభ్యర్థుల తుది కీ, సబ్జెక్టుల వారీ కటాఫ్ మార్కులు, ర్యాంక్ కార్డులను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఆంధ్రా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జరిగిన ఈ పరీక్షకు 30,448 మంది హాజరు కాగా.. అర్హత సాధించిన 2,444 మంది అభ్యర్థుల హాల్‌టికెట్ నెంబర్లతో ప్రత్యేక జాబితాను విడుదల చేశారు. స్కోర్ కార్డు డౌన్‌లోడ్ చేసుకొనేందుకు హాల్‌టికెట్ నంబర్ పుట్టిన తేదీ, సెక్యూరిటీ కీ ఎంటర్ చేయాల్సి ఉంటుంది.

## మూడంచెల భద్రత మధ్య ఈ వి ఎం స్ట్రాంగ్ రూములు




**పాడేరు, (విశాఖ సమాచారమ్):** జాతీయ ఎన్నికల కమిషన్, రాష్ట్ర ఎన్నికల కమిషన్ పాడేరు జిల్లా కలెక్టర్ ,జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో మూడంచెల భద్రత మధ్య అరకు పార్లమెంట్ స్ట్రాంగ్ రూమ్ వద్ద నిరంతర పహారా కేంద్ర ప్రభుత్వ బలగాలు తో భద్రత కల్పించారని బీజేపీ అరకు పార్లమెంట్ రిప్రజెంటేటివ్ రవికుమార్ పెనుమాక అన్నారు,శుక్రవారం ఆయన పాడేరు డిప్యూటీ కలెక్టర్ వి వి ఎస్ శర్మ తో కలసి భద్రత ఏర్పాట్లు తనిఖీ చేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్ వద్ద కేంద్ర బలగాలు తో పటిష్టమైన భద్రత కల్పించారు అని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రత మధ్య ఈ వి ఎం మిషన్లు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు పోలీసులు వలయంలో ఉన్న అరకు పార్లమెంట్ ఈ వి ఎం మిషన్లు భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లు పట్ల సంతృప్తి వ్యక్తం చేసారు, మరో 9 రోజుల పాటు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు అవసరం అని అయన అన్నారు, రాష్ట్రంలో, కేంద్రంలో ఎన్డీఏ కూటమి అభ్యర్థులు గెలుపు ఖాయమని ఆయన తెలిపారు,4 తేదీ న కూటమి అభ్యర్థులు అరకు పార్లమెంట్ అభ్యర్థి ని కొత్తపల్లి గీత, పాడేరు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిని గిడ్డి ఈశ్వరి,అరకు వేలి బీజేపీ అభ్యర్థి పాంగి రాజారావు భారీ మెజారిటీతో గెలవబోతున్నారని ఆయన జోస్యం చెప్పారు, టీడీపీ,బీజేపీ,జనసేన కూటమి రాష్ట్రంలో బారీ మెజారిటీ తో 156 సీట్లు తో ఎన్డీఏ కూటమి విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నారు అని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## మహిళలకు అవగాహన



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** భీమిలి మండలం చిప్పాడ గ్రామం లో పలు అంశాలపై మహిళలకు అవగహన కార్యక్రమం జరిగింది.స్త్రీ, శిశు సంక్షేమ శాఖ( ఐసిడిఎస్) భీమిలి ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మాసిక మహొూత్సవ కార్యక్రమం లో భాగం గా నిర్వహించిన కార్యక్రమం లో పాల్గొన్న ప్రాజెక్ట్ అధికారిణి ఎం శ్రీదేవి మహిళలకు ఋతుక్రమం పై గల అపోహలు, తీసుకోవలసిన జాగ్రత్తలను వివరిస్తూ పోషకాహారం ప్రాముఖ్యత, చేతులను శుభ్ర పరుచుకొనే విధానం, మాసికమహొూత్సవ నిర్వహణ తదితర అంశాలపై అవగహన కల్పించారు. కార్యక్రమం లో ఐసిడిఎస్ పర్యవేక్షకురాలు జె రేఖవాణి, మహిళా సంరక్షణ కార్యదర్శి, సచివాలయ ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు తదితరులు పాల్గొన్నారు.




# గ్రీన్ టీతో వచ్చే అనారోగ్య సమస్యలు



గ్రీన్ టీ అంటేనే సహజంగా లభించే ఒక దివ్యమైన ఔషదం అనే పేరు ఉంది. చాలామందిలోనూ ఇలాంటి భావనే ఉంటుంది. కానీ గ్రీన్ టీతో కూడా సైడ్ ఎఫెక్ట్ ఉంటాయి అనే విషయం తెలిస్తే షాక్ అవుతారు. ఎందుకంటే చాలామందికి గ్రీన్ టీతో వచ్చే లాభాలే తెలుసు కానీ గ్రీన్ టీ కూడా హానీ చేస్తుంది అనే విషయం చాలామందికి తెలియదు. ఏంటీ.. కొలెస్ట్రాల్ కరిగించి, అధిక బరువు తగ్గించి ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే గ్రీన్ టీ తో కూడా సైడ్ ఎఫెక్ట్ ఉంటాయా అని ఆశ్చర్యపోతున్నారా ? ఔను మీరు చదివింది నిజమే. ఇంతకీ ఆ సైడ్ ఎఫెక్ట్ ఏంటివి అనేవి తెలియాలంటే మనం మరిన్ని డీటేల్స్ లోకి వెళ్లాల్సిందే.

చాలామందిలో గ్రీన్ టీ ఆరోగ్యానికి మంచిది అనే భావన ఉంటుంది కనుక దీనిని ఎంత ఎక్కువ తీసుకుంటే ఆరోగ్యానికి అంత మంచిది అనే అపోహ కూడా ఉంటుంది. కానీ వాస్తవానికి గ్రీన్ టీ మోతాదుకు మించి కప్పులకు కప్పులు తాగితే లాభాల కంటే నష్టాలే ఎక్కువగా ఉంటాయి. అది ఆరోగ్యానికి మేలు కంటే చేసే చేటే ఎక్కువ.

ఖాళీ కడుపుతో గ్రీన్ టీ తాగితే కొంతమందికి కడుపులో మంట రావడంతో పాటు అది అసిడిటి సమస్యకు దారి తీసే ప్రమాదం లేకపోలేదు. గ్రీన్ టీలో ఉండే కంటెంట్స్ శరీరంలో ఐరన్, క్యాల్షియం వంటి ఇతర పోషకాలను గ్రహించడంలో అడ్డుపడతాయి. ఫలితంగా ఎముకలు బలహీనపడే ప్రమాదం లేకపోలేదు.

గ్రీన్ టీని ఎక్కువగా తీసుకోవడం వల్ల అది శరీరంలో ఐరన్ సంగ్రహించే ప్రక్రియను అడ్డుకుంటుంది. ఇది క్రమక్రమంగా ఐరన్ లోపానికి దారి తీస్తుంది. గ్రీన్ టీలోనూ కెఫైన్ ఉంటుంది. రోజులో ఎక్కువసార్లు గ్రీన్ టీ సేవించడం వల్ల శరీరంలో కెఫైన్ కంటెంట్ ఎక్కువై అది తలనొప్పికి దారితీస్తుంది.

గ్రీన్ టీని అధిక మోతాదులో సేవించడం వల్ల నిద్రలేమి సమస్యకు దారితీస్తుంది అని హెల్త్ కేర్ ఎక్స్‌పర్ట్స్ చెబుతున్నారు. గ్రీన్ టీని అధిక మొత్తంలో తీసుకోవడం వల్ల శరీరంలో అధిక మొత్తంలో చేరే కెఫైన్ మీ మెదడుకు రక్తం సరఫరా కాకుండా అడ్డుకుంటుంది. ఫలితంగా మోషన్ సిక్‌నెస్ అనే అనారోగ్య సమస్య తలెత్తుతుంది.

గ్రీన్ టీలో టానిన్ అనే పదార్థం ఉంటుంది. ఇది ఎక్కువ మొత్తంలో తీసుకుంటే.. కళ్లు తిరగడం లేదా వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. గ్రీన్ టీని ఎక్కువగా సేవిస్తే.. అది మీ కాలేయంపై దుష్ప్రభావం చూపించే ప్రమాదం ఉంది. గ్రీన్ టీ అధికంగా సేవించే వారిలో లివర్ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది.

# రోజ్ వాటర్ తో మీ ముఖాన్ని మెరిపించండిలా..!



రోజ్ వాటర్ గురించి అందరికీ తెలుసు. ప్రత్యేకంగా పరిచయాలు అవసరం లేదు. బ్యూటీని పెంచే ప్రాడెక్ట్స్ లో ఇది కూడా ఒకటి. ఫేస్ ని సాఫ్ట్ గా, మురికి లేకుండా చేస్తుంది. రోజ్ వాటర్ తో చర్మ సౌందర్యం పెంచుకోవచ్చని అందరికీ తెలుసు కానీ.. దీన్ని వాడాలో.. ఎలా వాడితో మంచి రిజల్ట్స్ ఉంటాయో చాలా మందికి తెలీవు. రోజ్ వాటర్ ని కూడా రోజూ వాడొచ్చు. దీంతో ఎలాంటి నష్టాలు, సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు. అయితే కొన్ని కెమికల్స్ కలిపిన రోజ్ వాటర్స్ కూడా మార్కెట్లో దొరుకుతాయి. ఈ విషయంలో మాత్రం చాలా జాగ్రత్తలు వహించాలి.

రోజ్ వాటర్ ని డైలీ వాడితే మీ ముఖం ఫ్రెష్ గా, క్లీన్ గా, నీట్ గా ఉంటుంది. ఇన్ ఫెక్షన్స్ రాకుండా దూరమవుతాయి. వృద్ధాప్య లక్షణాలు దూరమవుతాయి. చర్మం కూడా హైడ్రేట్ అవుతుంది. రోజ్ వాటర్ ని కేవలం ముఖానికి మాత్రమే కాదు. ఫేస్ కి కూడా వాడొచ్చు. ముడతలు రాకుండా, చర్మం పొడిబారకుండా ఉంటుంది. **చర్మాన్ని యవ్వనంగా చేస్తుంది:** రోజ్ వాటర్.. చర్మాన్ని యంగ్ గా చేయడంలో బాగా వర్క్ చేస్తుంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి.. కాబట్టి స్కిన్ ని ఫ్రీ రాడికల్స్ నుండి కాపాడుతుంది. అలాగే కొల్లాజెన్ ను ఉత్పత్తి చేస్తుంది. మచ్చలు, ముడతలు తగ్గి స్కిన్ టోన్ మారుతుంది.

**ఎలా వాడితే బెనిఫిట్:** రోజ్ వాటర్ ని టోనర్ లాగా వాడవచ్చు. అలాగే మేకప్ రిమూవర్ గా యూజ్ చేయవచ్చు. రోజ్ వాటర్ తో మేకప్ ఈజీగా వచ్చేస్తుంది. స్కిన్ కూడా మాయిశ్చరైజ్ గా ఉంటుంది. గులాబీ నీళ్లను తరచూ క్రమం తప్పకుండా వాడితే ఇన్ ఫెక్షన్స్ రాకుండా చేస్తుంది.

**రోజ్ వాటర్ నకిలీదని ఎలా గుర్తించాలి:** రోజ్ వాటర్ లో కూడా చాలా నకిలీవి తయారవుతున్నాయి. వీటిని చూడగానే కనిపెట్టవచ్చు. రంగు, వాసన కాస్తా వేరేలా ఉంటాయి. రోజ్ వాటర్ ఫ్లేవర్ స్మెల్ లో కాకుండా.. సెంట్ స్మెల్ లో వస్తే ఇది నకిలీదని ఈజీగా గుర్తిం చవచ్చు. అలాగే నకిలీ రోజ్ వాటర్ యూజ్ చేయగానే.. స్కిన్ పై దురద వస్తుంది. స్వచమైన రోజ్ వాటర్ ఎప్పుడూ దురద, అలర్జీ సమస్యల్ని కలిగించదు.

# డయాబెటీస్ ని తరిమేసే పొడర్ ఇదే.. ప్రేగులను కూడా శుభ్ర పరుస్తుంది!



ప్రస్తుతం ఇప్పుడు అందర్నీ వేధించే సమస్య డయాబెటీస్. మారిన ఆహారపు అలవాట్లు, జీవన విధానం కారణంగా.. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అందరూ దీని బారిన పడుతున్నారు. చిన్న వయసులోనే మధు మేహం సమస్యతో ఎంతో మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేలకు వేలు ఖర్చు పెట్టి మరీ ట్రీట్మెంట్లు తీసుకుంటున్నారు. ట్రీట్మెంట్ తీసుకుని.. ఎంత కంట్రోల్ లో ఉన్నా కూడా రోజు రోజుకూ ఈ వ్యాధి తీవ్రతరం అవుతూనే ఉంటుంది. దీంతో నచ్చిన ఆహారం తినలేక.. నోరు కట్టుకోవాల్సి వస్తుంది. ఇప్పటికే డయాబెటీస్ ను కంట్రోల్ లోకి తీసుకొచ్చే ఎన్నో రకాల ఫుడ్స్ గురించి, డ్రింక్స్ గురించి తెలుసుకున్నాం. ఇప్పుడు మొత్తానికి డయాబెటీస్ ను తరిమేసే మంచి దివ్యౌషధం గురించి తెలుసుకోబోతున్నాం.

స్టీవియా ఆకులు.. చాలా మందికి వీటి గురించి తెలీవు. ఈ ఆకులు తియ్యగా ఉంటాయి. ఈ ఆకుల పొడి మనకు ఎక్కడైనా లభిస్తుంది. మధుమేహం ఉన్న వారు చక్కెరకు బదులుగా దీన్ని వాడుకోవచ్చు. అలాగే డయాబెటీస్ ను కొద్ది రోజుల్లోనే కంట్రోల్ లోకి తీసుకొస్తుంది. క్రమం తప్పకుండా ఈ ఆకుల పొడిని వాడితే.. షుగర్ ను పూర్తిగా నియంత్రించవచ్చని నిపుణులు చెబుతున్నారు. డయా బెటీస్ ఉన్న వారికి ఇది బెస్ట్ అని చెప్పవచ్చు. ఎందుకంటే తీపి తినలేమని బాధ పడుతూ ఉంటారు. అలాంటి వారు ఈ పొడిని ఉపయోగించి స్వీట్లు కూడా తయారు చేసుకోవచ్చు.

పంచదార, బెల్లం వంటి వాటికి బదులు ఈ స్టీవియా ఆకుల పొడిని వాడుకోవచ్చు. టీ, కాఫీ, జ్యూస్ లు, టిఫిన్స్ లోకి, లస్సీ, వేడి వేడి పదార్థాల్లోకి ఇలా ఈ ఆకుల పొడిని తీసుకోవచ్చు. స్టీవియా ఆకుల్లో క్యాలరీలు, ప్రోటీన్, ఫైబర్, ఫ్యాట్ వంటి పోషకాలు ఉండవు. కాబట్టి ఈ ఆకులను హ్యాపీగా జీర్ణం అవుతుంది. ఇంకా ఈ పొడితో మరి కొన్ని ప్రయోజనాలు ఉన్నాయి.

ఈ పొడిని వాడటం వల్ల షుగర్ మాత్రమే కాకుండా.. అస్థమా, శ్లేష్మాలు, దగ్గు, పిల్లికూతలు వంటి వాటిని కూడా తగ్గిస్తుంది. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. బ్లడ్ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ల బారిన పడకుండా ఉండొచ్చు. రక్తంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది.

# జీడిపప్పుని అలా అస్సలు తినొద్దు..



స్వీట్స్‌లో ఎక్కువగా వాడే జీడిపప్పు ఎక్కువగా తింటారు. అదే విధంగా. జీడిపప్పుతోనే చాలా కాజు కత్లీ కూడా చేస్తారు. అదే విధంగా, చాలా కాజు బిర్యానీ, కాజు పన్నీర్ వంటి ఎన్నో వంటలు చేస్తారు.అయితే, దీనిని ఎలా తినాలి. ఎప్పుడు తినాలి. ఎంత మోతాదులో తినాలో తెలియకపోతే చాలా సమస్యలు వస్తాయి. అవేంటో పూర్తి వివరాలు తెలుసుకోండి.

**జీడిపప్పు..** జీడిపప్పులో రిచ్ ఫైబర్ ఉంటుంది. అదే విధంగా, గుండెకి మేలు చేసే ఫ్యాట్స్, కాపర్, మెగ్నీషియం, మాంగనీస్ వంటి పోషకాలు ఉంటాయి. ఇవి బ్రెయిన్ హెల్త్‌ని మెరుగ్గా చేయడమే కాకుండా, ఇమ్యూనిటీని పెంచి బోన్ హెల్త్‌ని కాపాడుతుంది.

**ఫ్రై చేయడం..** సాధారణంగా ఫ్రై చేయడం అన్ హెల్దీ అంటారు కానీ, వీటిని ఇలా ఫ్రై చేసే అందులో ట్యాక్సిన్స్ దూరమవుతాయి. కాల్చినవి జీడిపప్పు మంచివే. వాటిని అలానే తినాలి. అయితే, వీటిని నీటిలో నానబెట్టి కూడా తినొచ్చు. అప్పుడే ఆ పోషకాలు అందుతాయి.

**ట్యాక్సిన్స్ కూడా..** అదే విధంగా పెంకుతో ఉన్న జీడిపప్పులని కాల్చి లేదా ఎండబెట్టి జీడిపప్పులని తీసుకొస్తారు. దీనిని కాల్చినప్పుడు టాక్సిన్స్ కూడా దూరమవుతాయి. అందుకే వీటిని ఇలా ప్రాసెస్ చేయడం మంచిది. ప్రాసెస్ చేసిన జీడిపప్పులు మంచివి.

**అలర్జీ..** అన్ని ఫుడ్స్ అందరికీ పడవు. కొంతమందికి అలర్జీ సమస్యలు వస్తాయి. అదే విధంగా వాపు, ఎన్నో సమస్యలు వస్తాయి. ముఖ్యంగా, నట్ అలర్జీ ఉన్న వారు పచ్చి జీడిపప్పులు తింటే ఫుడ్ అలర్జీ వచ్చే అవకాశం ఉంది. కాబట్టి, కొన్ని తినగానే ఏమైనా సమస్యలొస్తే వాటిని తినడం ఆపేయడం మంచిదని చెబుతున్నారు నిపుణులు. అదే విధంగా వీటిని ఎక్కువగా తీసుకోవడం కూడా మంచిది కాదు.

**అలా ఫ్రై చేయొద్దు...** అయితే, చాలా మంది జీడిపప్పులు ప్రాసెస్ అయ్యాక వాటిని నూనెలో వేసి కారం, ఉప్పు చల్లి మసాలా కాజులా తింటారు. ఇలా ఫ్రై చేసే ప్రాసెస్‌లో అందులోని పోషకాలన్నీ దూరమవుతాయి. కాబట్టి, అలా అస్సలు చేయొద్దని గుర్తుపెట్టుకోండి. అదే విధంగా, మంచివి కదా అని ఎక్కువగా తినకపోవడమే ఆరోగ్యకరమని గుర్తుపెట్టుకోండి.

# పళ్లు ఎందుకు పుచ్చిపోతాయి?



చాలా మందికి పళ్లు పుచ్చిపోతుంటాయి. మరి కొందరికి చిగుళ్లు ఎపుడూ వాచిపోతూ ఉంటాయి. సరైన ఆహారం తినకపోవడమే ఈ లక్షణాలకు కారణమని వైద్యులతో పాటు పౌష్టికాహార నిపుణులు చెబుతుంటారు. పళ్లు, చిగుళ్లు ఆరోగ్యంగా ఉంటాలంటే ఎలాంటి ఆహారం తినాలో వారు చూసిస్తున్నారు.

కూరగాయలు, పళ్లలో ఫైబర్ ఉంటుంది. ఇది పళ్లపై ఉన్న బ్యాక్టీరియాను, పాచిని తొలగించటంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఉదాహరణకు యాపిల్స్‌లో ఉండే మాలిక్ యాసిడ్ - పళ్లపై పొరను శుభ్రం చేస్తుంది. అంతేకాకుండా వీటిలో ఉండే విటమిన్లు.. ఇతర పోషక పదార్థాలు పళ్లను, చిగుళ్లను బలోపేతం చేస్తాయి.

పాలు, పెరుగు, చీజ్ వంటి పదార్థాల్లో కాల్షియం, పాస్ఫరస్‌లు ఎక్కువగా ఉంటాయి. ఇవి బలమైన పళ్లకు, చిగుళ్లకు మేలు చేస్తాయి. చేపల్లో ఓమెగా ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. ఇవి చిగుళ్ల అనారోగ్యం బారిన పడకుండా కాపాడుతూ ఉంటాయి.

డ్రై ఫ్రూట్స్‌లో ఫైబర్, విటమిన్స్, మినరల్స్ ఉంటాయి. వీటిలో ఉండే పొడుకుండా ఉపయోగిస్తాయి. అంతేకాకుండా ఇవి పళ్లపై బ్యాక్టీరియా చేరకుండా కాపాడతాయి. ప్రతి రోజు ఆహారం తిన్న తర్వాత కొన్ని పదార్థాలు నోటిలో ఉండిపోతాయి. వీటిని వెంటనే శుభ్రం చేసుకోపోతే రకరకాల సమస్యలు ఏర్పడతాయి. దీనితో పాటుగా తరచూ నీటిని తాగుతూ ఉంటే నోటిలో లాలాజలం ఎక్కువగా ఊరుతుంది. ఇవి నోటిని శుభ్రం చేయటంలో కీలక పాత్ర పోషిస్తుంది.

చూయింగ్ గమ్స్‌ను తినటం వల్ల కూడా లాలాజలం ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. అయితే చ్యూయింగ్ గమ్‌లో చక్కెర ఉంటుంది. అందువల్ల సుగర్ ఫ్రీ చ్యూయింగ్ గమ్‌ను తినటం మంచిదని అభిప్రాయపడుతున్నారు.

# పరగడపున ఈ నీటిని తాగితే బరువు తగ్గడమే కాదు



సోంపు, యాలకులు.. ఇవి రెండు కూడా వేర్వేరుగా ప్రత్యేక గుణాలు కలిగి ఉన్నాయి. సాధారణంగా ఫుడ్ తిన్నాక చాలా మంది వీటిని తీసుకుంటారు. దీని వల్ల జీర్ణ సమస్యలతో పాటు నోటి దుర్వాసన కూడా దూరమవుతుంది. అయితే, వీటిని వాడడం వల్ల మరిన్ని సమస్యలు కూడా దూరమవుతాయట. అవేంటో తెలుసుకోండి.

**సోంపులోని పోషకాలు..**

అదే విధంగా, సోంపులో ఫైబర్, ప్రోటీన్, కార్బోహైడ్రేట్స్, ఐరన్, మెగ్నీషియం, మాంగనీస్‌లు ఉంటాయి. ఇవన్నీ కూడా శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. రెగ్యులర్‌గా వీటిని తీసుకోవడం మంచిది.

**యాలకుల్లోని గుణాలు..** యాలకుల్లో పొటాషియం, కాల్షియం, మెగ్నీషియంలు ఉంటాయి. వీటితో పాటు విటమిన్స్, రైబోఫ్లేవిన్, నియాసిన్, విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. అందుకే వీటిని ఎన్నో ఔషధాల తయారీలోని వాడుతున్నారు .

**జీర్ణక్రియ..** ఈ టీ తాగడం వల్ల జీర్ణక్రియ మెరుగ్గా మారుతుంది. దీనిని తీసుకోవడం వల్ల కడుపు సంబంధిత సమస్యలు దూరమవుతాయి. ఇందులోని ఫైబర్ జీర్ణక్రియని మెరుగ్గా చేస్తుంది. ఈ టీని తాగితే పేగు కదలికలు మెరుగవుతాయి. ఈ టీని రోజూ ఉదయం పరగడపున తాగితే మలబద్ధకం, అసిడిటీ, అజీర్ణం సమస్యలు తగ్గుతాయి.

**పీరియడ్స్ ప్రాబ్లమ్స్..** కొంతమంది మహిళల్లో ఇరెగ్యులర్ పీరియడ్స్ సమస్య ఉంటుంది. అలాంటి వారు ఈ యాలకులు, సోంపుతో తయారైన టీని తీసుకుంటే ఆ సమస్య చాలా వరకూ దూరమవతుంది. ఇందులోని విటమిన్లు, ఐరన్, పొటాషియం వంటి పోషకాలు సమస్యని తగ్గిస్తాయి. అంతేనా, పీరియడ్స్ టైమ్‌లో వచ్చే నొప్పులు కూడా దూరమవుతాయి.

**వాపు..** సోంపు, యాలకుల టీ తాగడం వల్ల శరీరంలో వాపు సమస్య తగ్గుతుంది. ఇందులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు పుష్కలంగా ఉంటాయి. దీంతో బాడీలోని ఇన్‌ఫ్లమేషన్ తగ్గుతుంది. ఈ టీని రోజూ ఉదయాన్నే ఖాళీ కడుపుతో తాగడం వల్ల ఆర్థరైటిస్, కీళ్ళ నొప్పులు, వాపు వంటి సమస్యలు దూరమవుతాయి.

**సోంపు, యాలకుల టీ..** అయితే, ఈ రెండింటితో కలిపి టీ తయారు చేయొచ్చు. ఈ టీని ఖాళీ కడుపుతో తాగడం వల్ల ఇమ్యూనిటీ పెరుగుతుంది. ఈ టీలో యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవన్నీ కూడా ఇమ్యూనిటీని పెంచుతాయి. సీజనల్, ఇన్ఫెక్షన్ల కారణంగా వచ్చే సమస్యల్ని ఈ టీ దూరం చేస్తుంది.

**బరువు తగ్గడం..** ఎంతో మంది బరువు తగ్గాలని ట్రై చేస్తుంటారు. అలాంటి వారు ఉదయాన్నే ఈ టీని తాగితే అందులోని ఫైబర్, ఆక్సిడెంట్స్, బాడీలోని అదనపు కొవ్వుని తగ్గిస్తాయి. దీనిని రెగ్యులర్‌గా తాగితే జీవక్రియ పెరిగి బరువు కంట్రోల్‌లో ఉంటుంది.

# నల్ల యాలకులు తెలుసా..



యాలకులు అనగానే సాధారణంగా లేత ఆకు పచ్చ రంగులో ఉండే చిన్న యాలకుల గురించే చాలా మందికి తెలుసు. కానీ, ఇందులో పెద్ద యాల కులు ఉంటాయి. ఇవి కాస్తా నలుపు రంగులో ఉంటాయి. వీటిని తీసుకుంటే చాలా సమస్యలు దూరమవుతాయి. ఇందులో యాంటీ ఆక్సిడెంట్ ఎలిమెంట్స్, యాంటీ బ్యాక్టీరియల్, విటమిన్ సి, పొటాషియం, మొదలైన ముఖ్య పోషకాలు ఉంటాయి. ఇవన్నీ ఆరోగ్యానికి చాలా మంచివి.

**కిడ్నీ సమస్యలు..** చాలా మంది అనేక కారణాలతో కిడ్నీ సమస్యలతో బాధపడతారు. అలాంటి వారు రెగ్యులర్‌గా పెద్ద యాలకులని ఆహారంలో చేర్చుకుని తింటే.. ఇవి బాడీ నుండి ట్యాక్సిన్స్ దూరం చేయడమే కాకుండా మూత్ర విసర్జనకి సంబంధించిన సమస్యల్ని కూడా దూరం చేస్తుంది.

**నోటి బ్యాక్టీరియా..** ఈ పెద్ద యాలకులు తీసుకుంటే యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలను కలిగి ఉంటాయి. దీనిని తీసుకోవడం వల్ల నోటిలోని బ్యాక్టీరియా దూరమవుతుంది. చిగుళ్ళ ఇన్ఫెక్షన్, దంతాల ఇన్ఫెక్షన్ దూరమవుతుంది. నోటి దుర్వాసన తగ్గించడంలో కూడా చాలా బాగా పనిచేస్తుంది.

**కడుపు సంబంధిత సమస్యలు..** పెద్ద యాలకులని తీసుకోవడం వల్ల కడుపు సంబంధిత సమస్యలు కూడా దూరమవుతాయి. చాలా మందికి ఆకలి ఉండదు. అలాంటి సమస్యని దూరం చేయడంలో యాలకులు హెల్ప్ చేస్తాయి. ఈ యాలకులు తీసుకోవడం వల్ల కడుపులో గ్యాస్, అసిడిటీ వంటి సమస్యల్ని దూరం చేస్తాయి. వీటిని తీసుకోవాలంటే పెద్ద యాలకులు తీసుకుంటే కడుపు ఉబ్బరం వంటి సమస్యలు దూరమవుతాయి.

**రక్తప్రసరణ..** పెద్ద యాలకుల్లో విటమిన్ సి, పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మ, రక్త ప్రసరణని మెరుగ్గా చేస్తాయి. ఇవి చర్మాన్ని అందంగా మార్చి మెరిసేలా చేస్తుంది.

**గుండె ఆరోగ్యం..** పెద్ద యాలకుల్లో యాంటీ ఆక్సిడెంట్ ఎంజైమ్స్ ఉంటాయి. ఇవి గుండె పనితీరుని మెరుగ్గా చేస్తాయి. వీటిని తీసుకోవడం వల్ల ఒత్తిడి తగ్గుతుంది. గుండె కండరాల కణజాలంపై బాగా పనిచేస్తాయి. వీటిని తీసుకోవడం వల్ల గుండె సమస్యలు చాలా వరకూ తగ్గుతాయి.

# ఆహారంలో పెరుగును ఎందుకు తినాలంటే?



చాలా మందికి పెరుగు అంటే ఏమాత్రం ఇష్టం ఉండదు. అనేక మంది దీన్ని ఆరగించేందుకు ఇష్టపడరు. అయితే, పెరుగు వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ఈ విషయాన్ని అనేక మంది న్యూట్రిషన్లతో పాటు వైద్యులు కూడా చెప్పారు. అసలు ఆహారంలో పెరుగు తీసుకోవడం వల్ల కలిగే లాభ నష్టాలు ఏంటో పరిశీలిద్దాం.

పెరుగులో మన జీర్ణ వ్యవస్థను మెరుగుపరిచే మంచి బ్యాక్టీరియా ఉంటుంది. ఈ బ్యాక్టీరియా కడుపులోని యాసిడ్ స్థాయిలను నియంత్రిస్తూ ఉంటుంది. అందువల్ల ఆహారం తిన్న పెరుగు తినమంటారు. లేదా మజ్జిగ తాగమంటారు. కొందరికి కడుపునెప్పి తరచు వస్తూ ఉంటుంది. విరోచనాలు కూడా అవుతూ ఉంటాయి. దీనికి బిలోఫిలియా అనే బ్యాక్టీరియా కారణం. ఈ బ్యాక్టీరియాను ఎదుర్కోవటంలో పెరుగు చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది.

పెరుగులో కాల్షియం, ఫాస్ఫరిన్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఎముకలను బలోపేతం చేయటంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. పెరుగులో కొవ్వు ఎక్కువ ఉంటుందని దీని వల్ల గుండెకు ఇబ్బంది కలుగుతుందని కొందరు భావిస్తారు. కానీ పెరుగు మంచి కొలెస్ట్రాల్‌ను పెంపొందించటంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. దీనివల్ల గుండె జబ్బులు వచ్చే అవకాశం తక్కువ ఉంటుంది. పెరుగులో ప్రొటీన్ ఎక్కువగా ఉంటుంది. అందు వల్ల దీనిని తింటే శరీరంలో బ్లడ్ సుగర్ విలువలు తగ్గుతాయి. మధుమేహ వ్యాధిగ్రస్తులు కూడా దీనిని తినవచ్చు.

# పెంచిన విద్యుత్ చార్జీల సర్క్యులర్ ను తక్షణం ఉపసంహరించుకోవాలి




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖ స్టీల్ ప్లాంట్ ఉక్కు నగరంలో నివాసముంటున్న కార్మికులపై పెంచిన విద్యుత్ ఛార్జీల సర్క్యులర్ ను తక్షణం ఉపసంహరించుకోవాలని 78 వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి గంగారావు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. నేడు స్టీల్ సిఐటియు ఆధ్వర్యంలో ప్రధాన పరిపాలన భవనం ఎదుట "అక్రమంగా పెంచిన కరెంటు చార్జీల అమలు నిలుపు చేయాలని","సర్క్యులర్ ను ఉపసంహరించుకోవాలని" ప్రధాన డిమాండ్లతో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పెద్ద ఎత్తున కార్మికులు తమ నిరసనను తెలియజేశారు.

ఈ ధర్నాను ఉద్దేశించి 78 వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి గంగారావు మాట్లాడుతూ స్టీల్ యాజమాన్యం ఏకపక్షంగా పెంచిన విద్యుత్ చార్జీల అమలు నిలుపు చేయాలని, దీని మీద ఇచ్చిన సర్క్యులర్ ను తక్షణం ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యుత్ ఉద్యమానికి ప్రభుత్వాలే తలకిందులు అయ్యాయని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. విశాఖ నగరంలో గల ఏ పరిశ్రమ టౌన్ షిప్ లలో లేని విధంగా స్టీల్ యాజమాన్యం కార్మికులపై విద్యుత్ భారాలను మోపుతోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఇటువంటి అనాలోచిత చర్యలను తక్షణం ఉపసంహరించుకోకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని ఆయన హెచ్చరించారు.

స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె అయోధ్యరామ్ మాట్లాడుతూ స్టీల్ యాజమాన్యం గుర్తింపు సంఘంతో మాట్లాడకుండా విద్యుత్ భారాలను కార్మికులపై రుద్దడాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. 35,56 గజాలలో నివసిస్తున్న కార్మికులపై ఈ విధంగా నిరంకుశంగా నిర్బంధాలను ప్రయోగించడం అత్యంత దుర్మార్గమని ఆయన అన్నారు. యాజమాన్యం నిర్ణయాన్ని తక్షణం ఉపసంహరించుకోకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు రామస్వామి, అధ్యక్షులు వైటి దాస్, సి ఎఫ్ టి యు ప్రధాన కార్యదర్శి డి సురేష్ బాబు మాట్లాడుతూ కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించకుండా, నూతన వేతనాలు అమలు చేయకుండా, పూర్తిస్థాయిలో ఉత్పత్తి చేయకుండా, కార్మిక సౌకర్యాలపై యాజమాన్యం అనుసరిస్తున్న మొండి వైఖరికి వ్యతిరేకంగా పోరాటాలతో ప్రతిఘటించాలని వారు అన్నారు. యాజమాన్యం కార్మిక వ్యతిరేక విధానాలకు వత్తాసు పలుకుతున్న గుర్తింపు యూనియన్ వైఖరిని వారు తీవ్రంగా విమర్శించారు. నేటి వరకు కార్మికులు 50 పైసలు గా చెల్లిస్తున్న యూనిట్ విద్యుత్ చార్జీలను 8 రూపాయలకు పెంచడం అత్యంత దుర్మార్గమని దీనిని తక్షణం ఉపసం హరించుకోవాలని వారు అన్నారు. ప్రభుత్వ యాజమాన్యాలు స్టీల్ పరిశ్రమ పైన, కార్మికుల పైన జరుపుతున్న దాడిని ఐక్య ఉద్యమాలతో ప్రతిఘటనకు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో స్టీల్ సిఐటియు నాయకులు పి శ్రీనివాసరాజు, బి అప్పారావు, గంగాధర్, పుల్లారావు, మరిడయ్య,శ్రీనివాస్ రెడ్డి,బి ఎన్ మధుసూదన్, రాజు, అప్పలరాజు, లోకేష్, రాజారావు, పృధ్వి, చారి, చిరంజీవి, శ్రీనివాసరాజు తదితరులతోపాటు వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు అధిక సంఖ్యలో యువ కార్మికులు పాల్గొన్నారు.

## షిర్డీ సాయిబాబా సన్నిధిలో వంశీకృష్ణ శ్రీనివాస్, పద్మజ దంపతులు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** శుక్రవారం మహారాష్ట్ర లో ప్రముఖ పుణ్యక్షేత్రం షిరిడీ సాయిబాబా వారి ఆలయాన్ని జనసేన విశాఖ నగర అధ్యక్షులు, దక్షిణ నియోజకవర్గం కూటమి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీ వంశీకృష్ణ శ్రీనివాస్ సందర్శించారు. ఆలయంలో సాయిబాబా వారిని దర్శించుకొని, ఆలయ సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబా వారికి ఇష్టమైన నైవేద్యాన్ని సమర్పించారు. స్వామి వారి సేవలో పాల్గొనడం అదృష్టం గా భావిస్తున్నానని ఈ సందర్భంగా వంశీ గారు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సునీల్, రఘు పాల్గొన్నారు.

## కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్స్ లో 66 ద్విచక్ర వాహనాలను సీజ్



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** జిల్లా ఎస్పీ కే.వీ.మురళీకృష్ణ వారి ఆదేశాల మేరకు నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీజి.ఆర్.ఆర్. మోహన్ ఆధ్వర్యంలో పాయకరావుపేట ఇన్స్పెక్టర్ అప్పలరాజు, ఎస్సైలు జోగారావు, రామారావు మరియు సబ్ డివిజన్ పోలీసు సిబ్బందితో పాయకరావుపేట మండలం, అంబేద్కర్ కాలనీ మరియు దుర్గా కాలనీ కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లి నిర్వహించి సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 66 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్న పాయకరావుపేట పోలీసులు.ఈ సందర్భంగా అధికారులు సంబంధిత గ్రామాల ప్రజలతో మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్న సందర్భంగా గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ జరిగే విధంగా పటిష్ట భద్రత చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే అనుమానస్పద ప్రాంతాల్లో ఈ కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు ఎటువంటి అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొనరాదని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం సబ్ డివిజన్ పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ముస్లిం రిజర్వేషన్లపై కలకత్తా హైకోర్టు తీర్పు హర్షణీయం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ముస్లింలకు ఓబీసీ రిజర్వేషన్ చెల్లదంటూ కలకత్తా హైకోర్టు తీర్పును ఇవ్వడంపై బిజెపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఓ బి సి మోర్చ జిల్లా అధ్యక్షులు కంచి పాటి వెంకట సన్యాసిరావు అధ్యక్షతన ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు పరమేశ్వర రావు అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగం కుల ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించింది కానీ మత ప్రాతిపదికన కాదని అన్నారు. బిజెపి పార్టీ మత రిజర్వేషన్ లను ఎప్పటినుంచో వ్యతిరేకిస్తుందని వెల్లడించారు. ఏ రాజకీయ పార్టీ అయినా ప్రజలను ఆకట్టుకోవాలని మత రిజర్వేషన్లకు పాల్పడటం తగదన్నారు. అలాంటి వారికి కలకత్తా హైకోర్టు తీర్పు చెంపపెట్టు అన్నారు. ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షులు కంచిపాటి వెంకట సన్యాసిరావు, రాష్ట్ర ఓబీసీ మోర్చ సెక్రెటరీ కర్రి రామకృష్ణ, జనరల్ సెక్రెటరీ యర్రా అచ్చం నాయుడు, ఓబీసీ మండల అధ్యక్షులు కోసూరి మోహన్ రావు, బిజెపి నాయకులు కొండబాబు మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

# డైట్‌లో సాఫ్ట్వేర్ ఉద్యోగాల ప్రాంగణ నియామకాలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానిక డైట్ అటానమస్ కళాశాలలో టెక్నిక్స్ ఇంటెగ్రేషన్ టెక్నాలజీస్ కంపెనీకి ప్రాంగణ నియామకాలు నిర్వహించారు. టెక్నిక్స్ ఇంటెగ్రేషన్ టెక్నాలజీస్ కంపెనీకి చెందిన ట్రైనింగ్ హెడ్ పి. రవి కుమార్ , ధనశ్రీ డైట్ కళాశాలకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థులకు ఇంటర్వ్యూ నిర్వహించారు. ఇందులో డైట్ కళాశాలకు చెందిన 240 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో 110 మంది వ్రాత పరీక్షలో ఉతీర్ణులు అయ్యారు . తదుపరి టెక్నికల్ ఇంటర్వ్యూ నిర్వహించ గా ఇందులో 57 మంది తదుపరి హెచ్ ఆర్ ఇంటర్వ్యూ కి అర్హత సాధించారు. హెచ్ ఆర్ ఇంటర్వ్యూ ఆన్లైన్ లో నిర్వహిస్తామని టెక్నిక్స్ ఇంటెగ్రేషన్ టెక్నాలజీస్ కంపెనీకి చెందిన ట్రైనింగ్ హెడ్ . రవి కుమార్ తెలియజేసారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ డైట్ తో చాలా సాఫ్ట్వేర్ కంపెనీ లు ఎంపానెల్ చేసుకున్నారని తద్వారా విద్యార్థులకు మరిన్ని ఎక్కువ నియామకాలు జరగనున్నాయని తెలియజేసారు . ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు మాట్లాడుతూ టెక్నిక్స్ ఇంటెగ్రేషన్ టెక్నాలజీస్ కంపెనీ మల్టీ నేషనల్ కంపెనీ లో ఒకటి అని దానికి విద్యార్థులు అందరూ తమ ప్రతిభ కనబరచాలి అని ప్రోత్సహించారు. డీన్ అకాడెమిక్స్ డాక్టర్ కే.పార్వతి మాట్లాడుతూ డైట్ లో ప్రాంగణ నియామకాలకు పెద్ద పీట వేశారు అని దీనిని విద్యార్థులు అందరూ ఉపయోగించుకోవాలని కోరారు. ట్రైనింగ్ అండ్ ప్లేసెమెంట్ ఆఫీసర్ వై హేమంత్ కుమార్ మాట్లాడుతూ తమ విద్యార్థులకు బి టెక్ . మూడవ సంవత్సరములలోనే క్యాంపస్ రిక్రూట్మెంట్ ట్రైనింగ్ అందించడము జరుగుతుందని దీనివలన మల్టీనేషనల్ కంపినీలలో మా విద్యార్థులు ఉద్యోగములు సాధించి వున్నత స్థానములలో స్థిరపడ్డారు మరియు స్కిల్ ఉన్న ప్రతి విద్యార్థి కి ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి అని తెలియజేసారు. ప్రాంగణ నియామకాలు అనంతరం టెక్నిక్స్ కంపెనీ ట్రైనింగ్ హెడ్ రవి కుమార్ ని సహాయక సిబ్బందిని చైర్మన్ రత్నాకర్ , ప్రిన్సిపాల్ వైకుంఠ రావు సాలువాతో ఘనంగా సత్కరించి మెమెంటో అందజేశారు. ఈ కార్యక్రమానికి వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్యాం ప్రసాద్ , డాక్టర్ ఈశ్వర రావు అకడమిక్ కోఆర్డినేటర్ కృష్ణ నాగ్ , టి.పి.ఓ శ్రీ హేమంత్ వివిధ విభాగాధిపతులు మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

## అనకాపల్లి జిల్లా నందు మెగా రిటైల్ ఎక్స్పోర్ట్ 20 24 కార్యక్రమం




**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం విజయనగరం జిల్లా వారు అనకాపల్లి లో ఎక్స్పోర్ట్ 20 24 కార్యక్రమం నిర్వహించడం జరిగింది. స్థానిక రింగ్ రోడ్డు జంక్షన్ వద్దనున్న సన్ క్యాస్ట్ ల్ హెూటల్లో గురువారం జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా నరేష్, డిప్యూటీ జోనల్ హెడ్ శంకర్ హేమ్ రామ్ , డిప్యూటీ రీజినల్ హెడ్ ప్రసాద్ , ఎల్ డిఎం సత్యనారాయణ అనకాపల్లి జిల్లాలో ఉన్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్లు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం సందర్భంగా హెూమ్ లోన్, ఎడ్యుకేషన్, వెహికల్ లోన్,పర్సనల్ లోన్ అన్ని విభాగాల్లో 32.35 కోట్ల రూపాయిలు మంజూరు చేయబడింది. సంబంధిత లెటర్స్ కస్టమర్ కి ఇవ్వడం జరిగింది.

డిప్యూటీ జోనల్ హెడ్ మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ వివిధ సేవలను మెరుగుపరిచిందని కస్టమర్లు దానిని సద్వినియోగపరుచుకోవాలని తెలిపారు.

## మే 28 నుండి రామనారాయణంలో ధనుర్విద్యలో శిక్షణా కార్యక్రమం



**విజయనగరం, (విశాఖ సమాచారమ్):** ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం శ్రీ రామ నారాయణం శ్రీమద్రామాయణ ప్రాంగణం లో వారధి - రామనారాయణం - ధనుర్విద్య అనే పేరుతో మే 28 నుండి మే 30 వ తేదీ వరకు ధనుర్విద్యలో శిక్షణాకార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎన్ సి ఎస్ ట్రస్ట్ సభ్యులు నారాయణం శ్రీనివాస్ తెలిపారు . ధనుర్వేదం మరియు ధనుర్విధ్య శిక్షణలో నిపుణులు, ఉపాసకులు, ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ ధనుర్వేదం వ్యవస్థాపకులు విభాకర్ తివారీ గురూజీ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం ఉంటుందని అన్నారు.. శిక్షణలో ప్రతిభ కనబరిచిన వారికి గురూజీ చేతులుమీదుగా ప్రోత్సాహం, బహుమతి ప్రధానం జరుగుతుందని పేర్కొన్నారు.10 సంవత్సరములు పైబడిన వారు మాత్రమే ఈ శిక్షణలో పాల్గొనేందుకు అర్హులు అని తెలిపారు . పూర్తి వివరాలకు 9347017144, 8919767705. నెంబర్లకు సంప్రదించాలని కోరారు

# ఉపాధి కూలీలకు రోజు కూలి 300 రూపాయలు ఇవ్వాలి



**పరవాడ, (విశాఖ సమాచారమ్):** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు కొలతలతో సంబంధం లేకుండా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రోజు కూలి 300 రూపాయలు ఇవ్వాలని పరవాడ మండలం ఈ బోణింగి ఉపాధి హామీ కూలీలతో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ,ఏరోజు ఎంత వేతనం పడుతుందో తెలుసుకునే విధంగా పే స్లిప్పులు ఇవ్వాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి డిమాండ్ చేశారు. మండు టెండలో పని చేస్తున్న ఉపాధి కూలీలకు కేంద్ర ప్రభుత్వం రోజుకు 300 రూపాయలు కూలి ఇస్తున్నామని చెప్పినా పెరిగిన ధరలకు అనుగుణంగా లేదు కూలి తక్కువ పని ఎక్కువ గా ఉంది అందువలన ఎవరు ఎంత కూలి పడుతుందో తెలుసుకునే విధంగా గతంలో పేస్లిప్ప ఇచ్చేవారు ఇప్పుడు ఇవ్వడం లేదు ఎండవేడికి ప్రభుత్వం ఉపాధి కూలీలకు మజ్జిగ, మంచినీరు సౌకర్యం కల్పించాలని 30 శాతం వేసవి అలవెన్సు ఇచ్చి ఆదుకోవాలని, ప్రతి 15 రోజులకి ఒకసారి పని చేసిన కూలి డబ్బులు ఇవ్వాలని సంవత్సరానికి ప్రతి కుటుంబానికి 200 రోజులు పని దినాలు కల్పించి రోజు వేతనం 600 ఇవ్వాలని కోరారు మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు,ఈ కార్యక్రమంలో ఈ బోనింగి గ్రామ ఉపాధి హామీ కూలీలు శేషమ్మ, అప్పారావు, రమణ, లక్ష్మి, అప్పల నరసింహ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

# రైతు భారతి ఆడిటోరియంలో కరాటేపై విద్యార్థులకు సెమినార్

### 2వ అంతర్జాతీయ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల పోస్టర్ ఆవిష్కరించిన రత్నాకర్



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** పట్టణంలోని వి.వి.రమణ రైతుభారతి ఆడిటోరియంలో శుక్రవారం నిజి షోటోకాన్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా , నాయుడు సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులకు సంయుక్తంగా నిర్వహిస్తున్న కరాటే శిక్షణ ముగింపు కార్యక్రమం జరిగింది. ఇందులో కరాటేపై నిర్వహించిన కుమిటె సెమినార్ జరిగింది. ఈ సెమినార్‌కు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జపాన్‌కు చెందిన 10వ బ్లాక్ బెల్ట్ డాన్, హ్యాన్షి షుకొకాయ్ ప్రపంచ కరాటే యూనియన్ మరియు ర్యూన్షిన్‌కాన్ అంతర్జాతీయ కరాటే ఫెడరేషన్ అధ్యక్షులు సొకేటకేషి మసుయమ, హ్యాన్షి, 9వ బ్లాక్ బెల్ట్ డాన్, కెన్షొబుడో క్యోకాయ్ వ్యవస్థాపక ఛైర్మన్ ప్రొఫెసర్ వి.పూజారి, ఎస్.ఎస్.ఎస్.కె.ఎ.ఐ. టెక్నికల్ అడ్వైజర్, షిహాన్ వి.రవీందర్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి దాడి రత్నాకర్ మాట్లాడుతూ ఈ వేసవి సెలవులను విద్యార్థులు వృథాగా పోనివ్వకుండా దేహదారుఢ్యంపై దృష్టిసారించాలన్నారు. ఇందుకోసం మన శరీరాన్ని ధృఢంగా మార్చేందుకు కరాటే, కుంగ్ పూ వంటి క్రీడలు దోహదం చేస్తాయన్నారు. గ్రామీణ ప్రాంతాలనుంచి వచ్చిన ఎంతోమంది క్రీడాకారులకు విదేశాలనుంచి నిపుణులైనవారితో శిక్షణ ఇప్పించడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా వచ్చే ఏడాది ఫిబ్రవరి 7,8,9 తేదీల్లో నిర్వహించే రెండో ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల కోసం రూపొందించిన 'నిజత్ కప్ 2025' పోస్టర్‌ను రత్నాకర్ ఆవిష్కరించారు. విశాఖపట్నంలో జరిగే ఈ అంతర్జాతీయ పోటీలకు దేశ విదేశాలనుంచి క్రీడాకారులు హాజరవుతారని చెప్పారు. ఇటువంటి పోటీలను నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయుడు సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ అధ్యక్షులు ఎస్.పి. ఎం.డి.నాయుడు, ఎస్.డి. గ్రూప్స్ ఛైర్మన్ కాండ్రేగుల శ్రీరామ్, నేషనల్ బాడీ బిల్డర్ ఎస్.బాబీ, జి.ఆనంద బాబు, ఎస్.కిశోర్‌కుమార్, ఎం.సుందరం, పి.నరసింహారావు అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# బీచ్ పారా ఒలింపిక్స్ లో పాల్గొనే దివ్యాంగ క్రీడాకారుడుకి అండగా నిలిచిన సీఎం రమేష్



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** చైనాలో జరుగు వరల్డ్ బీచ్ పారా ఒలింపిక్స్ వాలీబాల్ పోటీలకు ఎంపిక అయిన అనకాపల్లి జిల్లా వాసి దివ్యాంగ క్రీడాకారుడు అన్నం గణేష్ ను సీఎం రమేష్ ఘనంగా సత్కరించారు. స్థానిక బైపాస్ రోడ్ ల ఉన్న సీఎం రమేష్ కార్యాలయంలో గణేషుని సీఎం రమేష్ సత్కరించారు దేశం గర్వించే విధంగా విజయంతో తిరిగి రావాలని ఆశీర్వదిస్తూ ముందస్తుగా అభినందనలు తెలియపరిచారు.ఈ సందర్భంగా సీఎం రమేష్ ల మాట్లాడుతు అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం పెనుగొల్లు శివారు పాత సోముదేవుపల్లికి చెందిన దివ్యాంగ యువకుడు అన్నం గణేష్ పారా వాలీబాల్ జాతీయ జట్టుకు ఎంపిక కావడం ఎంతో సంతోషం గా ఉంది అని ఈ నెల 28 నుంచి జూన్ 4 వరకు చైనాలో నిర్వహించనున్న బీచ్ పారా వాలీబాల్ వరల్డ్ ఛాంపియన్షిప్లో పాల్గొనే 12 మంది సభ్యులలో ఆంధ్రప్రదేశ్ నుంచి ఒక్క గణేష్ మాత్రమే ఎంపిక అవ్వడం మన తెలుగు వాళ్లకు గర్వకారణం అని తెలిపారు.గణేష్ కు చిన్నప్పటి నుంచి క్రీడలపై ఆసక్తితో వాలీబాల్ ఆడటం నేర్చుకొని తన ప్రతిభకు అంగవైకల్యం అడ్డు కాదని ఈరోజు జాతీయ జట్టు లో చోటు సంపాదించి నిరూపించాడు అని నిరుపేద కుటుంబం నుండి వచ్చి ఇప్పటికే పారా క్రీడల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపి జాతీయ జట్టుకు ఎంపిక కావడం చిన్న విషయం కాదు అని కృషి పట్టుదలతో గ్రామస్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయికి వెళ్లిన తీరు అద్భుతం అని తెలుపుతూ గణేష్ తల్లిదండ్రులుకు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేసారు.స్థానిక నాయకులు ద్వారా గణేష్ గురించి స్వయంగా తెలుసుకున్నాను అని గత ఏడాది కజకిస్తాన్ లో జరిగే పోటీలకు ఎంపికైనా ఆర్థిక పరిస్థితుల వల్ల వెళ్లలేకపోవడం నిజంగా దురదృష్టం అని అలాంటి పరిస్థితులు జిల్లాలో ఏ క్రీడాకారుడుకి రాకుండా నా వంతు భాద్యత గా అన్నీ విధాలుగా అండగా ఉంటాము అని రానున్న కూటమి ప్రభుత్వంలో క్రీడారంగానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తామని, ఈరోజు చైనా కు ప్రయాణం అవుతున్న గణేష్ కు ఖర్చులు నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందజేశారు అలాగే భవిష్యత్ లో అన్నీ విధాలుగా అండగా ఉంటాము అని భరోసా ఇచ్చారు.

# వారిని ఇప్పుడు నియమించొద్దు

యూపీపీఎస్సీ ఛైర్మన్‌కు చంద్రబాబు లేఖ



అమరావతి: యూపీపీఎస్సీ ఛైర్మన్ డాక్టర్ మనోజ్ సోనీకు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం లేఖ రాశారు. ఐఏఎస్‌కు రాష్ట్ర కేడర్ ఆఫీసర్ల ఎంపిక కార్యక్రమాన్ని మోడల్ కోడ్ ఉన్నప్పుడు చేయడం సముచితం కాదని చెప్పారు. కొత్త ప్రభుత్వం వచ్చే వరకు నియమించొద్దని యూపీఎస్సీని చంద్రబాబు కోరారు. వారి ప్రమోషన్స్ ముఖ్యమంత్రి కార్యాలయంలోని వారికే పరిమితం చేశారన్నారు. ఇప్పుడు కూడా జాబితా తయారీలో పారదర్శకత లేదని అన్నారు.

ఈ అంశాన్ని పునః పరిశీలించాలని యూపీపీఎస్సీ ఛైర్మన్‌ను చంద్రబాబు నాయుడు కోరారు. అయితే ఏపీ సార్వత్రిక ఎన్నికలు అయిపోయిన తర్వాత వైద్య పరీక్షల కోసం చంద్రబాబు అమెరికా వెళ్లిన విషయం తెలిసిందే. మాచర్లలో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎంను ధ్వంసం చేస్తుంటే.. ఆయనకు ఎదురెల్లి టీడీపీ పోలింగ్ ఏజెంట్ నంబూరి శేషగిరిరావు అడ్డుకున్నారు. అయితే ఆ తర్వాత అతనిపై పిన్నెల్లి, అతని అనుచరులు గొడ్డళ్లతో తీవ్రంగా దాడి చేసి గాయపరిచారు.

ఆయనను చంద్రబాబు రెండు రోజుల క్రితం అమెరికా నుంచే ఫోన్ చేసి పరామర్శించారు. ఈ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి తప్పకుండా విజయం సాధిస్తుందన్న ధీమాలో చంద్రబాబు ఉన్నారు. విదేశీ పర్యటనను ముగించుకొని నాలుగైదు రోజుల్లో ఏపీకి వస్తారని సమాచారం. ఆ తర్వాత ఎన్నికల ఫలితాలు, రాష్ట్రంలో ఉన్న పరిస్థితులపై పార్టీ కేడర్‌తో చంద్రబాబు సమీక్షించనున్నట్లు తెలుస్తోంది.

# ఆజంఖాన్‌కు ఉపశమనం, ఏడేళ్ల జైలుశిక్షపై కోర్టు స్టే



లక్నో: సమాజ్ మాజీ పార్టీ సీనియర్ నేత, ఉత్తరప్రదేశ్ మాజీ మంత్రి ఆజంఖాన్‌కు నకిలీ బర్త్ సర్టిఫికెట్ కేసులో ఉపశమనం లభించింది. ఈ కేసులో ఆయనకు పడిన ఏడేళ్ల జైలు శిక్షపై అలహాబాద్ హైకోర్టు శుక్రవారంనాడు 'స్టే' ఇచ్చింది. అయితే, ఇదే కేసులో జైలుశిక్ష పడిన ఆయన భార్య తాంజిన్ ఫాతిమా, కుమారుడు అబ్దుల్లా ఆజంకు విధించిన శిక్షపై 'స్టే' ఇచ్చేందుకు కోర్టు నిరాకరించింది.

ఆజంఖాన్, ఆయన భార్య, కుమారుడు ముగ్గురికి బెయిలు మంజూరైనందనీ, అయితే ఆజంఖాన్‌కు పడిన జైలుశిక్షపై కోర్టు 'స్టే' ఇచ్చినప్పటికీ తక్కిన ఇద్దరికీ 'స్టే' మంజూరు చేయలేదని ఖాన్ తరపు న్యాయవాది శరద్ శర్మ మీడియాకు తెలిపారు.

**కేసు ఏమిటి?**

నకిలీ పుట్టినరోజు సర్టిఫికెట్ కేసు 2019 జనవరి3వ తేదీ నాటిది. ప్రస్తుత రాంపూర్ బీజేపీ ఎమ్మెల్యేగా ఉన్న ఆకాష్ సక్సేనా ఈ కేసు పెట్టారు. ఆజంఖాన్, ఆయన భార్య ఫాతిమాలు తన కుమారుడైన అబ్దుల్లా ఆజంఖాన్ కోసం రెండు బర్త్ సర్టిఫికెట్లు తీసుకున్నట్టు సక్సేనా పోలీసు కేసు పెట్టారు. ఈ కేసులో ఫోర్జరీ నేరంపై ఈ ముగ్గురికి సెషన్స్ కోర్టు ఏడేళ్ల జైలుశిక్ష విధించింది. ఆజంఖాన్‌కు 2019లో విద్వేష ప్రసంగం చేసిన కేసులో మూడేళ్ల జైలుశిక్ష పడింది. దీంతో ఆయన అసెంబ్లీ సభ్యత్వంపై అనర్హత వేటుపడింది. రాంపూర్ సదర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆయన 2022లో వరుసగా పదోసారి గెలిచారు. దీంతో 2019లో గెలిచిన రాంపూర్ పార్లమెంటరీ సీటును ఆయన వదులుకున్నారు. పదిసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఆజంఖాన్ లోక్‌సభకు, రాజ్యసభకు సైతం ఎన్నికయ్యారు.

# బర్డ్ ఫ్లూ పౌల్ట్రీ ఉత్పత్తుల అమ్మకం.. దిగుమతిపై నిషేధం



**కేరళ:** బర్డ్ ఫ్లూ కలవరం కేరళను వణికిస్తోంది. మానన్కాడ్ ప్రాంతంలోని ప్రభుత్వ ప్రాంతీయ కోళ్ల ఫారంలో బర్డ్ ఫ్లూ (ఏవియన్ ఫ్లూ వేరియంట్) చాలా వేగంగా వ్యాప్తి చెందినట్లు జిల్లా అధికారులు ప్రకటన విడుదల చేశారు. ఈ మేరకు కోళ్ల ఫారాలు ఉన్న ఒక కి.మీ పరిధిలో ఉన్న పెంపుడు పక్షులను వెంటనే చంపాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. జిల్లాలోని కోడి, బాతు, పిట్ట, ఇతర పక్షుల పౌల్ట్రీ ఉత్పత్తుల విక్రయాలను ప్రభుత్వం ప్రస్తుతం నిషేధించింది. ఫ్లూ ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వైరస్‌ను నిర్వీర్యం చేసేందుకు రసాయనాలు స్ప్రే చేస్తున్నారు. కోళ్ల ఫారం నుంచి 1 నుంచి 10 కి.మీ మేర పరిధిని రెడ్ జోన్‌గా ప్రకటించామని అధికారులు పేర్కొన్నారు. కొట్టాయం జిల్లాలో చికెన్, బాతు, పిట్ట, ఇతర పక్షుల పౌల్ట్రీ ఉత్పత్తుల అమ్మకం, దిగుమతిపై అధికారులు నిషేధం విధించారు.

## ఏపీ సెట్ పరీక్ష ఫలితాలు విడుదల

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** రాష్ట్ర స్థాయి అర్హత పరీక్ష ఏపి సెట్ 2024 ఫలితాలను విడుదల చేసి ఏపిసెట్ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. పరీక్షకు మొత్తం 30448 హాజరవగా 2444 మంది అర్హత సాధించారు. అర్హత సాధించిన విద్యార్థులు, స్కోర్ కార్డ్ తదితర వివరాలను ఏపి సెట్ వెబ్‌సైట్ నుంచి పొందవచ్చునని ఏపిసెట్ మెంబర్ సెక్రటరీ ఆచార్య జి.ఎం.జె రాజు తెలిపారు. దరఖాస్తులో అభ్యర్థులు అందించిన వివరాలు ఆధారంగా సర్టిఫికేట్ల పరిశీలన పూర్తిచేసి విద్యార్థులకు ఏపిసెట్ అర్హత సాధించినట్లుగా ధృవీకరణ పత్రాలను పంపడం జరుగుతుందన్నారు.

# గవర్నర్ మౌనం రాష్ట్రానికి మంచిది కాదు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** రాష్ట్రంలో పల్నాడు, రాయలసీమ ప్రాంతాల్లో జరుగుతున్న దాడులు, దష్టికాలపై దేశవ్యాప్తంగా చర్చ జరిగి రాష్ట్ర ప్రతిష్ట దిగజరిపోతుంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రా గవర్నర్ అబ్దుల్ నజీర్ మౌనం వహించడం సరికాదని లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు శుక్రవారం అనకాపల్లి రింగురోడ్డు జనసేన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగిన తరువాత ప్రస్తుతం జరిగిన ఎన్నికలు మూడోవని ఎప్పుడూ జరగని అల్లర్లు, దాడులు,దాష్టికాలు ఇప్పుడే జరిగాయని, ఎవ్వరూ ఊహించని రీతిలో జరిగిన దాడుల వలన రాష్ట్రంలో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని,ఎన్నికల కౌంటింగ్ తరువాత జరిగే పరిస్థితి ని అంచనా వేసి పల్నాడు, రాయలసీమ ప్రాంతాల్లో ని ప్రజలు ఇప్పటికే గ్రామాలు వదిలి వెళ్లిపోయే పరిస్థితి ఏర్పడిందని,మరోవైపు ఎన్నికల్లో పాల్గొని విధులు నిర్వహిస్తున్న ఆర్వోలు,పిఓ లు,ఏపీఓ లు విధులు నిర్వహించలేక భయపడుతున్నారని, గవర్నర్ అబ్దుల్ నజీర్ వెంటనే ప్రధాన రాజకీయ పార్టీ నేతలను పిలిపించి గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఏర్పడే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్రంలో ని రెండు ప్రధాన రాజకీయ పార్టీలు పోలీసులను,రాష్ట్రంలో ని పరిపాలనా వ్యవస్థను,ఎన్నికల సంఘం ప్రతినిధులను విఫలమయ్యారని అంటుంటే వ్యవస్థను గాడిలో పెట్టేందుకు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర గవర్నర్ పై ఉందని భీశెట్టి అన్నారు,రాష్ట్రంలో ఎన్నికల అనంతరం నిజాయితీగా పనిచేసే పోలీసులు,రెవెన్యూ అధికారులు, ఎన్నికల అధికారులు రాజకీయ పార్టీల విమర్శలతో నలిగిపోతున్నారని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రతిష్టను అందరూ సమిష్టిగా కాపాడవలసిన బాధ్యత తీసుకోవాలని భీశెట్టి కోరారు.ఈ సమావేశంలో అడపా నరసింహంమూర్తి, తుమ్మపాలమాజీ ఎంపిటిసి కనుబుద్ధి నరసింగరావు,పౌర వేదిక ప్రతినిధి కొలసాని రమణ తదితరులు పాల్గొన్నారు.

# అభ్యర్థులు 8.30 లోపే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి



**విజయనగరం:** ఏ.పి. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌డిప్యూటీ డి.ఇ.ఓ.ల నియామకం కోసం నిర్వహించే ఆన్‌లైన్ పరీక్షకు అభ్యర్థులంతా మే 25వ తేదీ శనివారం ఉదయం 8.30 గంటల లోపే తమకు నిర్దేశించిన పరీక్ష కేంద్రాలకు చేరుకోవలసి ఉంటుందని జిల్లా రెవిన్యూ అధికారి ఎస్.డి.అనిత చెప్పారు. పరీక్ష రాసే అభ్యర్థులను ఉదయం 7.30 గంటల నుంచి 8.30 గంటల వరకు పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారని పేర్కొన్నారు. ఆ తర్వాత వచ్చిన వారిని పరీక్ష కేంద్రంలోకి అనుమతించరని స్పష్టంచేశారు. యీ పరీక్షల నిర్వహణపై డి.ఆర్.ఓ. శుక్రవారం తన ఛాంబరులో సమీక్షించారు.

జిల్లాలోని ఆరు పరీక్షా కేంద్రాల్లో యీ పరీక్ష శనివారం ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు ఆన్ లైన్‌లో జరుగుతుందన్నారు. యీ పరీక్షకు 1470 మంది హాజరుకానున్నారని తెలిపారు. జి.ఎం.ఆర్.ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, రాజాంలో 300 మంది, ఎం.వి.జి.ఆర్.కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, చింతలవలసలో 250 మంది, అవంతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, భోగాపురం మండలంలో 170 మంది, బొబ్బిలిలోని స్వామి వివేకానంద ఇంజనీరింగ్ కళాశాలలో 90 మంది, సత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, విజయనగరంలో 150, ఇయాన్ డిజిటల్ జోన్, సీతం కాలేజీ, కొండకరకాంలో 510 మంది పరీక్షకు హాజరు అవుతున్నట్టు తెలిపారు.

రాజాం పరీక్ష కేంద్రంలో పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల సౌకర్యార్థం విజయనగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఉదయం 5.30, 6 గంటలకు ప్రత్యేక బస్ సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తమ హాల్‌టిక్కెట్‌తో పాటు ఒరిజినల్ ఫోటో గుర్తింపుకార్డు తీసుకువెళ్లాలని సూచించారు. సమావేశంలో ఏ.పి.పి.ఎస్.సి. అధికారులు, పరీక్ష కేంద్రాల సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

# జార్జ్ క్లబ్‌లో ఘనంగా యోగ ద్వితీయ వార్షికోత్సవాలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** భారత స్వాభిమాన ట్రస్ట్, పతంజలి యోగ సమితి జిల్లా అధ్యక్షుడు భీశెట్టి దొరమ్మ నాయుడు సారథ్యంలో రెండు సంవత్సరాలుగా ఎందరికో సంపూర్ణ ఆరోగ్యాన్నిస్తూ జిల్లా వ్యాప్తంగా పలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు గాను అందరిచే **యోగా చేయిద్దాం రోగాలు లేకుండా జీవిద్దాం** అనే సంకల్పంతో రాందేవ్ బాబా ఆశీస్సులు తో ఇప్పటికే 80 మంది సహ ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసి ఉన్నారు. జిల్లాలో పలు యోగా కేంద్రాల ద్వారా మరింత యోగాని అందరికీ దగ్గర చేసేందుకు అనకాపల్లి జార్జి క్లబ్ నందు నిరంతర యోగ శిక్షణ తరగతులు ప్రతిరోజు నిర్వహిస్తున్నారు. ద్వితీయ సంవత్సర వేడుకల్లో భాగంగా యోగా గురువు దొరమ్మ నాయుడు మాట్లాడుతూ మూడు రోజులు కార్యక్రమాల్లో భాగంగా 24న జల యోగ కార్యక్రమం శారదా నగర్ లో గల ఈశ్వర్ స్విమ్మింగ్ పూల్ నందు శ్వాసపై ధ్యాస పెంపొందించేందుకు జలాశనాలు నిర్వహించడం జరిగిందన్నారు. 25 న యోగ పై నగర సంచరణ యోగాతో శరీరము ఆయుధం అయితే ఆరోగ్యం జీవితకాలం బానిస అవుతుంది దీనిపై పట్టణ ప్రధాన కూడలినందు ఆరోగ్యం పెంపొందించుకునే విధంగా ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. 26న పూజ్య స్వామి రిత్ దేవ్ మహారాజ్ జి, పతంజలి యోగపీట్ హరిద్వార, శ్రీ జొన్నలగడ్డ శ్రీనివాసులు ఏపీ భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ అధ్యక్షులు, ప్రముఖులు విచ్చేస్తున్నారు అన్నారు. వార్షికోత్సవ కార్యక్రమం సాయంత్రం 5.00 గం.లకు గాయత్రి, మృత్యంజయ హోమం మహిళలచే యోగాసనాల ప్రదర్శన , యోగా విషిష్టత గుర్చి వివరించి పలు అనారోగ్య సమస్యలకు ఏ ఆసనాలు బాగా అనుకూల మంచి ఫలితాలను ఇస్తాయో వాటిపై వివరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జార్జి క్లబ్ అధ్యక్షులు, కార్యదర్శి బి ఎస్ ఎం కె జోగి నాయడు, బుద్ద కాశీ విశ్వనాథ్, వి చంద్రశేఖర్, బీమర్శెట్టి శ్రీనివాసరావు, జి మంగయ్య, కె వి వి సత్యనారాయణ, కాండ్రేగుల చిన్న, కోలపర్తికన్నబాబు, పెంటకోట సుబ్రహ్మణ్యం, ఆళ్ల సూర్య రామకృష్ణ, కొణతాల పెద్ద, మల్ల నరసింగరావు, కత్రి గంగాధర్, వంశీధర్, రోహిణి(మహిళాయోగా), రమణమ్మ అన్ని ప్రాంతాల యోగ సాధకులు పాల్గొన్నారు.

# చోడవరం నియోజకవర్గ నాయకులుతో జిల్లా ఎస్. పి సమావేశం



**రావికమతం, (విశాఖ సమాచారమ్):** ఎన్నికల ఫలితాలు వెల్లువడనున్న సందర్భంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు సంయమనంతో వ్యవహరించాలని జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ తెలిపారు.

జూన్ 4వ తేదీన 6 అసెంబ్లీ, అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు అనకాపల్లి మండలం, శంకరం గ్రామం, కలెక్టరేట్ వద్ద గల ఫ్యూచర్ వరల్డ్ స్కూల్ లో ఓట్ల లెక్కింపు మరియు ఫలితాలు విడుదల సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు సంయమనంతో వ్యవహరించాలని జిల్లా ఎస్పీ శ్రీ కె.వి.మురళీకృష్ణ ఐపీఎస్ కోరారు.

రావికమతం మండలం, తిరుమల ఫంక్షన్ లో జరిగిన సమావేశానికి చోడవరం నియోజకవర్గంలోని 4 మండలాలైన చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాల వై.సి.పి., టి.డి.పి, జనసేన., బి.జె.పి మరియు ఇతర పార్టీల ముఖ్య నాయకులతో సుమారు 300 మందితో సమావేశం జరిగింది.

ఈ సమావేశం లో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ కౌంటింగ్ కు ముందుగానీ, కౌంటింగ్ రోజు గాని, కౌంటింగ్ తర్వాత గాని ఏటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట భద్రత చర్యలు తీసుకుంటున్నామని, కౌంటింగ్ రోజు 144 సెక్షన్, 30 పోలీస్ ఆక్ట్ అమలులో ఉంటుందని తెలిపారు. కౌంటింగ్ ముగిసిన తర్వాత ఎటువంటి ఊరేగింపులు, ర్యాలీలు చేయకూడదని, ఎవరు కూడా గుంపులుగా ఉండకూడదని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించబోమని, ప్రజలందరూ సంయమనంతో వ్యవహరిస్తూ, శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ మండల రాజకీయ పార్టీల నాయకులకు సూచించారు.

ఎవరైనా ఎలక్షన్ కమిషన్ ఆదేశాలను మీరి వ్యవహరిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ఎవరైనా విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసిన, ఘర్షణలకు పాల్పడిన కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఇతర సమయాలలో నమోదు చేసే కేసులు కన్నా, ఎన్నికల సమయంలో నమోదు చేసే కేసుల యొక్క తీవ్రత ఎక్కువగా ఉంటుందన్నారు.

ఈ సమావేశంలో అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ శ్రీ ఎస్.అప్పల రాజు, కొత్తకోట సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎల్.అప్పల నాయుడు, చోడవరం ఇన్స్పెక్టర్ బి.శ్రీనివాస రావు, ఎస్సై లు కె.లక్ష్మణరావు, డి.ధనుంజయ నాయుడు మరియు వివిధ మండలాల రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.

# ధూమపాన ప్రియులకు ఒక హెచ్చరిక..

ప్రభుత్వం ఈ ప్రకటన జారీచేసినప్పటికే చాలామంది ఈ వ్యసనంకి అడిక్ట్ అయ్యారు. 50,60,70,80 దశాబ్దాలలో సిగరెట్ స్మోకింగ్ అలవాటు విచ్చలవిడిగా ఉండేది. చిన్న చిన్న బడ్డీలలో కూడా సిగరెట్లు దొరికేవి. పది సిగరెట్స్ ఉన్న ప్యాక్ ధర ఒక రూపాయి ఉండటంతో అన్నివర్గాల వారికి అందుబాటులో ఉండేది. ఇంచుమించు ప్రతి కుటుంబం లోను సిగరెట్ స్మోక్ చేసేవారు ఉండేవారు. మా స్కూల్ డేస్ లలో ఖాళీ ఐన సిగరెట్ డొక్కులు సేకరించి ఓపెన్ ప్లేసెస్ లో ఆడుకునేవారం. ఒక చదరం గీసి అందులో సిగరెట్ ప్యాక్ ల కొన్ని ఒకదానిపై ఒకటి పెట్టేవారం. కొంచెం దూరం నుంచి ఒక రాయి వాటి మీదకు గురిపెట్టి విసిరేవాళ్ళం. ఎన్ని సిగరెట్ ప్యాక్ లు చదరం దాటి వస్తే అవి ఆ వ్యక్తి సొంతం అయ్యేవి. మా చిన్నతనంలో ఎంతో ఉత్సాహంగా ఆడుకునే ఆట ఇది. అందుకని వీలైనంత ఎక్కువగా సేకరించేవారం. ఎవరు ఏ బ్రాండ్ సిగరెట్ తాగేవారో నేను బాగా పరిశీలించే వాణ్ణి. దిగువ మధ్యతరగతి జనం ఎక్కువగా చౌకధరలో దొరికే చార్మినార్ సిగరెట్ లను ప్రిఫర్ చేసేవారు. కేవెండర్స్ నేవీకట్, కేప్స్ టెన్, సిజర్స్, పాసింగ్ షో వంటి సిగరెట్లు మధ్యతరగతి వారు ప్రిఫర్ చేసేవారు. సినీ నటుల ఫేవరెట్ బర్కిలీ సిగరెట్ అని పటులతో బర్క్ లీ వారు విస్తృతంగా ప్రకటనలు ఇచ్చేవారు. ధనిక వర్గం వారి సిగరెట్ మాత్రం.. విల్స్ ఫ్లేక్, విల్స్ ఫిల్టర్, విల్స్ గోల్డ్. ధర పది రూపాయలు.. అంటే మనకి అందుబాటులో లేని ధర. అంటే ఒక సిగరెట్ ధర ఒక రూపాయి. పది నయాపైసలు, ఇరవై నయా పైసలు కి సిగరెట్ దొరుకుతున్నప్పుడు కాస్ట్ లీ బ్రాండ్స్ కి ఎవరూ వెళ్ళరు కదా మిడిల్ క్లాస్ వ్యక్తులు. సినిమా థియేటర్ల ఆవరణలో, రైల్వే ప్లాట్ ఫాంల వద్ద ఖాళీ ప్యాక్ లు ఎక్కువగా దొరికేవి. మా ముగ్గురు మేనమామ లకు సిగరెట్ అలవాటు ఉండేది. రైల్వే ఉద్యోగులు చాలామందికి సిగరెట్ తాగే అలవాటు ఉండేది. కారణం నైట్ షిఫ్టు కూడా ఉంటాయి గనుక. నాకూ యీ అలవాటు 1975-1980 మధ్యకాలంలో ఉండేది. ఇంట్లో తెలియకుండా జాగ్రత్త పడుతూ శని ఆదివారాల్లో సాయంత్రం బయటికెళ్ళి నప్పుడు మాత్రమే మా ఫ్రెండ్స్ కలుసుకునే ఓ పాన్ షాప్ వద్ద. ఆదివారాల్లో టీ తాగి , సిగరెట్ వెలిగించి ఈవెనింగ్ షోస్ సినిమాలకు వెళ్ళిపోయే వాళ్ళం. ఓసారి మా అమ్మకి అనుమానం వచ్చింది నా షర్ట్ నుంచి సిగరెట్ వాసన రావడంతో. నా పక్క కూర్చున్న ఫ్రెండ్ కి సిగరెట్ అలవాటు ఉందని చెప్పి తప్పించుకున్నాను. వివాహం అయ్యాక మా టైగర్ మాట శిరసావహించి సిగరెట్ మానేశాను. మూడేళ్ల క్రితం సిగరెట్ మానేసి 40 సంవత్సరాలైన సందర్భంగా.. ఈవెంట్ ని ఫ్రెండ్స్ తో ఈ వేదికలో షేర్ చేసుకున్నాను. సిగరెట్ తాగేవారిని చూడటం కూడా నాకిష్టమే. సిగరెట్ తాగడంలో ఓ స్టైల్ ఉంది. భార్యాభర్తలు (1961) సినిమాలో హీరో నాగేశ్వరరావు చేతిలో వెలుగుతున్న సిగరెట్ తో ఎంతో దర్జాగా స్టైలిష్ గా కనిపిస్తారు. తరువాత చాలా సినిమాల్లో కూడా. శతృఘన్ సిన్హా స్టైలిష్ గా సిగరెట్ తాగే విధానం చాలామందికి ఆదర్శంగా నిలిచింది.. రజనీకాంత్ తో సహా. రజనీకాంత్ సిగరెట్ పట్టుకోవడం స్మోక్ చేయడం ఎంత ప్రత్యేకంగా ఉంటుందో మనకి తెల్సిందే. సరదా సరదా సిగరెట్టు అంటూ రేలంగి పాడుతూ సిగరెట్ తాగుతూ గిరిజ మీదకి పొగ వదలడం, ప్లస్ పాయింట్ లను వర్ణించడం, గిరిజ మైనస్ పాయింట్స్ చెబుతుండటం.. ఇలా భలే సరదాగా కొసరాజు గారు రాముడు భీముడు (1964) సినిమా కోసం ఈ సిగరెట్ పాట సరదాగా రాశారు. ఐతే సిగరెట్ అలవాటు హానీకరమే. సరదా సరదాగా నా సిగరెట్ అనుభవాలు మీతో అలనాటి జ్ఞాపకాలను పంచుకునే సదుద్దేశంతోనే.. యీ ఉదయం సరదా సరదా కాఫీ కబుర్లు..

గాదె లక్ష్మీ నరసింహ స్వామి (నాని)
విజయనగరం ఫోన్ 99855 61852

# సినిమా



## కింగ్ ఆ డైరెక్టర్ కి అడ్వాన్స్ ఇచ్చారా?



'నా సామి రంగ 'కాంబోని కింగ్ నాగార్జున మరోసారి రిపీట్ చేయబోతున్నారా? కమిట్ అయిన చిత్రాలతో పాటు విజయ్ బిన్నీని మళ్లీ తెరపైకి తెస్తున్నారా? అంటే అవుననే లీకులందుతున్నాయి. నాగార్జున హీరోగా విజయ్ బిన్ని దర్శకత్వంలో సక్రాంతి కానుకుగా రిలీజ్ అయిన 'నా సామిరంగ' మంచి విజయం సాధించిన సంగతి తెలిసిందే. సంక్రాంతికి పర్ఫెక్ట్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ గా నిలిచింది. కొరియోగ్రాఫర్ గా ఉన్న విజయ్ ని పిలిచి మరీ నాగ్ దర్శకుడిగా అవకాశం కల్పించి చేయించిన చిత్రమిది. తొలి ప్రయత్నంతోనే విజయ్ విమర్శకుల ప్రశంసలు అందుకున్నాడు. మంచి మేకర్‌గా గుర్తింపు దక్కించు కున్నాడు. అయితే ఇంతవరకూ రెండవ సినిమా ప్రకటించింది లేదు. కథలు సిద్దంగా ఉన్నా హీరోలంతా బిజీగా ఉండటంతో దర్శకులంతా ఖాళీగా ఉండాల్సిన పరిస్థితులు కళ్ల ముందు కనిపిస్తూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో విజయ్ రెండవ సినిమా లేట్ అవుతుంది. ఈ నేపథ్యంలో నాగార్జున రెండవ సినిమా ఛాన్స్ మళ్లీ అతడికే ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. ఇటీవలే విజయ్ ని ఆఫీస్ కి పిలిపించి అడ్వాన్స్ కూడా ఇచ్చారుట. సినిమా చేద్దాం..రెడీగా ఉండని ప్రామిస్ చేసారుట. అలా ఇద్దరి మధ్య మరో ప్రాజెక్ట్ లాక్ అయినట్లు తెలుస్తోంది. అయితే స్టోరీ ఏంటి? అన్నది తెలియదు. నా సామి రంగ కంటేముందే విజయ్ ..నాగార్జునకి ఓ యాక్షన్ బ్యాక్ డ్రాప్ స్టోరీ చెప్పారు. కానీ నాగ్ సలహా మేరకు అప్పుడా కథని పక్కనబెట్టి తాను ఇచ్చిన కథని డైరెక్ట్ చేయమని చెప్పడంతో విజయ్ మాటకు కట్టుబడి పనిచేసాడు. తాజాగా అడ్వాన్స్ ఇచ్చిన నేపథ్యంలో విజయ్ సొంత కథని తెరపైకి తెస్తారా? లేకుంటే మరోసారి నాగార్జునే స్టోరీ విషయంలో ఛాన్స్ తీసుకుంటారా? అన్నది చూడాలి. ప్రస్తుతం నాగార్జున శేఖర్ కమ్ములా దర్శకత్వంలో 'కుబేర' చేస్తున్నారు. ఇందులో ఓ కీలక పాత్ర మాత్రమే. త్వరలోనే తన పార్టు షూటింగ్ కూడా పూర్తవుతుంది. అనంతరం తమిళ దర్శకుడు నవీన్ సినిమా పట్టాలెక్కించనున్నారు.

## స్టార్ హీరోయిన్ నెక్లెస్ ధర తెలిస్తే మైండ్ బ్లో



గ్లోబల్ స్టార్‌గా పాపులరైంది ప్రియాంక చోప్రా. అమెరికన్ గాయకుడు నిక్ జోనాస్‌ని పెళ్లాడాక అమెరికాలోనే నివాసం ఉంటోంది. ముంబైలో వ్యవహారాల్ని చక్కబెడుతూనే అమెరికాను హాలీవుడ్ ని విడిచిపెట్టడం లేదు. ఇటీవల అంబానీల ఈవెంట్ కోసం ముంబైలో అడుగుపెట్టిన ప్రియాంక చోప్రా, బాలీవుడ్ లో సొంత బ్యానర్ సినిమాలపైనా దృష్టి సారించింది. మరోవైపు ప్రియాంక చోప్రా వరుస ఫోటోషూట్ల ఇంటర్నెట్ ని షేక్ చేస్తున్నాయి. తాజాగా పీసీ షేర్ చేసిన ఓ ఫోటోషూట్ యువతరంలో హాట్ టాపిక్ గా మారింది. ఈ ఫోటోషూట్ లో పీసీ మతి చెడేలా అందాలను ఆరబోసింది. డార్క్ బ్యాక్ గ్రౌండ్ తో ఫోటోషూట్ ఇది. నేపథ్యానికి తగ్గట్టుగానే పూర్తిగా బ్లాక్ షిమ్మరీ ఫ్రాక్ ని ధరించిన పీసీ ఎద అందాలు మతులు చెడగొడుతున్నాయి. ఈ సొగసును మించి అందరి కళ్లు వేరొక వస్తువుపైకి వెళుతున్నాయి. అది ప్రియాంక చోప్రా ధరించిన ఖరీదైన ఈ వజ్రాల హారం ధర రూ. 358 కోట్లు అని తెలిస్తే ఎవరైనా షాక్ కి గురవ్వకుండా ఉండగలరా? ఇది పాపులర్ బ్రాండ్ కి చెందిన నెక్లెస్ అని తెలిసింది. బల్గారి బ్రాండ్ 140వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన ఒక ఈవెంట్‌లో ప్రియాంక చోప్రా ఇటీవల అద్భుతంగా కనిపించింది. ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఒక విషయం పీసీ ధరించిన అద్భుతమైన నెక్లెస్. ఆ ఆభరణం ధర రూ. 358 కోట్లు. ఈ నెక్లెస్‌లో 140 వజ్రాలు ఉన్నాయి. అంటే బ్రాండ్ ఎన్నో వార్షికోత్సవంలోకి వెళితే అన్ని వజ్రాలతో ఈ నెక్లెస్ ని డిజైన్ చేస్తున్నారని సమాచారం. ఈ నెక్లెస్ బల్గారి అంతర్జాతీయ బ్రాండ్ కి చెందిన అత్యంత విలువైన సర్పెంటి నెక్లెస్‌లలో ఒకటి. ఈ కళాఖండాన్ని సిద్ధం చేయడానికి స్పష్టంగా 2800 గంటలు పట్టింది. కెరీర్ పరంగా చూస్తే.. ప్రియాంక చోప్రా హాలీవుడ్ లోను పాపులరైంది. బాలీవుడ్ , హాలీవుడ్ లో తనకు తెరుచుకునే అనేక తలుపులు ఉన్నాయని చెప్పడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న మిలియన్ల మంది మహిళలకు ప్రియాంక చోప్రా మనో ధైర్యాన్ని ఇవ్వగలిగింది. అమెజాన్ ప్రైమ్ వీడియోలో పీసీ నటించిన షో సిటాడెల్ గత సంవత్సరం చాలా ఎక్కువగా చర్చనీయాంశమైంది. దాని భారతీయ వెర్షన్ త్వరలో OTT లో ప్రసారం కానుంది. సమంత, వరుణ్ ధావన్ నటించగా దీనిని రాజ్ అండ్ డీకే తెరకెక్కించారు.

## సాయి ధరమ్ తేజ్.. 100 కోట్ల బడ్జెట్టా..



సాయిధరమ్ తేజ్, గత ఏడాది "విరూపాక్ష" విడుదల అనంతరం కొంత గ్యాప్ తీసుకున్నప్పటికి ఇప్పటివరకు తన తదుపరి ప్రాజెక్ట్ పై స్పష్టత ఇవ్వలేదు. ఆ మధ్య పలు సినిమాలపై చర్చలు జరిపారు కానీ, వాటిలో కొన్నిటి పనులు ప్రారంభం కాకుండానే ఆగిపోయాయి. ముఖ్యంగా సంపత్ నంది దర్శకత్వంలో గాంజా శంకర్ అనే సినిమా మొదలయ్యింది కానీ అది సడన్ గా ఆగిపోయింది. సాయిధరమ్ తేజ్ "విరూపాక్ష" తరువాత చేసిన యాక్సిడెంట్ నుండి పూర్తిగా కోలుకునేందుకు కొంత సమయం తీసుకున్నారు. గత ఏడాది ప్రత్యేక చికిత్స కోసం అమెరికాకు వెళ్లి, చికిత్స తీసుకున్న తర్వాత తిరిగి వచ్చి, కొత్త కథలు వినడం ప్రారంభించారు. విరూపాక్ష మార్కెట్ లో 100 కోట్ల బిజినెస్ చేయడం అతని కెరీర్ కు బాగా బూస్ట్ ఇచ్చింది. ఇక పవన్ తో చేసిన బ్రో సినిమా కమర్షియల్ గా బాగానే క్లిక్కయ్యింది. ఇక ఇప్పుడు "హనుమాన్" నిర్మాత నిరంజన్ రెడ్డి సాయిధరమ్ తేజ్ కి గట్టి అడ్వాన్స్ ఇచ్చి, తన తదుపరి చిత్రాన్ని ఖాయం చేశారని తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ తో రోహిత్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సినిమా పూజా కార్యక్రమాలతో ఈ జూన్ నెలలో గ్రాండ్‌గా ప్రారంభం కానుంది. సినిమా బడ్జెట్ దాదాపు రూ. 100 కోట్లు ఉంటుందని సమాచారం, ఇప్పటివరకు ఇంత బిగ్ బడ్జెట్ లో సాయి సినిమా చేయలేదు. ఇది పాన్ ఇండియా స్థాయిలో వచ్చే ఏడాది విడుదల కానుంది. రాజకీయ అంశాలపై, యాక్షన్ థ్రిల్లర్ గా రూపొందనున్న ఈ సినిమా పై అభిమానుల్లో, సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. సాయిధరమ్ తేజ్ కొత్త యవతరం దర్శకులైన రోహిత్ తో కలిసి చేస్తున్న ఈ ప్రయోగాత్మక ప్రాజెక్ట్, టాలీవుడ్ లో మరో సంచలనంగా నిలుస్తుందని నమ్మకంగా ఉన్నారు. అలాగే సాయిధరమ్ తేజ్ మరిన్ని కొత్త ప్రాజెక్ట్స్ పై సంతకం చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ కొత్త ప్రాజెక్ట్ తో పాటు ఆయన మరిన్ని సినిమాలకు కూడా రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. సినిమా పరిశ్రమలో మేగా హీరోగా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న సాయిధరమ్ తేజ్, రాబోయే ఈ భారీ ప్రాజెక్ట్ తో మరింత ప్రతిష్టాత్మకంగా ముందుకు రావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇక రోహిత్ ప్రాజెక్టుకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నట్లు నిర్మాతలు వెల్లడించారు. మొత్తం మీద సాయిధరమ్ తేజ్ తన కొత్త ప్రాజెక్ట్ తో మరింత హుషారుగా ముందుకు సాగుతున్నారు.

## వరుణ్ తేజ్.. ఈ లుక్ కిర్రాక్ గురు



ఇండస్ట్రీలో హీరోలు చేసిన ఎక్స్పరిమెంట్స్ కొన్ని సార్లు వర్కౌట్ అవ్వవు. కానీ కొందరు మాత్రం మాత్రం ప్రయోగాలు చేస్తూనే ఉంటారు. అలాంటి వారిలో మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ కచ్చితంగా ముందు వరుసలో ఉంటారు. కెరీర్ స్టార్టింగ్ నుంచి కూడా వరుణ్ చూపులన్నీ ప్రయోగాలపైనే ఉన్నాయి. విభిన్నమైన జోనర్లలో సినిమాలు చేస్తూ అలరిస్తున్నారు. రిజల్ట్ తో సంబంధం లేకుండా వరుస మూవీల్లో నటిస్తున్నారు వరుణ్. అప్పుడప్పుడు మెగా రూట్ ఫాలో అయినా.. ఎప్పుడూ తనకంటూ సపరేట్ రూట్ వేసుకోవడానికే ఇష్టపడుతుంటారు వరుణ్ తేజ్. కొన్ని మాస్ సినిమాలు తప్ప.. ఇప్పటి వరకు ఆయన సినిమాల్లో చాలా వరకు డిఫెరెంటే. ఫలితంతో పని లేకుండా ముకుంద, కంచె, అంతరిక్షం లాంటి భిన్నమైన మూవీలు చేశారు వరుణ్. వీటితో పాటు ఫిదా, తొలిప్రేమ లాంటి లవ్ స్టోరీస్ తో కూడా ఆడియన్స్ ను ఆకట్టుకున్నారు. ఆ మధ్య ఎక్కువగా ఇమేజ్ బేస్ట్ కథలు ఎంచుకున్నారు వరుణ్ తేజ్. అందులో ఎఫ్ 2, గద్దలకొండ గణేష్ సినిమాలు మాత్రమే వర్కౌట్ అయ్యాయి. గని, గాంఢీవదారి అర్జున బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా మారాయి. ఇటీవల ఆపరేషన్ వాలంటైన్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాగా.. ఆ మూవీ కూడా ఫ్లాప్ అయింది. ఇప్పుడు కరుణ కుమార్ తో పీరియాడిక్ సినిమా మట్కా చేస్తున్నారు. ఈ మూవీతో గట్టి హిట్ కొట్టాలని వరుణ్ తేజ్ చూస్తున్నారు. ఇక పర్సనల్ విషయానికొస్తే.. ఇటీవల తన బాబాయ్ పవన్ కళ్యాణ్ కు సపోర్ట్‌గా పిఠాపురంలో వరుణ్ పర్యటించారు. పవన్ ను ఓటేసి గెలిపించాలని కోరారు. ఇక ఎన్నికలు ముగిశాక.. మళ్లీ సినిమా షూటింగ్ తో బిజీగా మారారు. లేటెస్ట్‌గా వరుణ్.. వెకేషన్ కు వెళ్లినట్లు తెలుస్తోంది. ఇన్ స్టాలో అట్రాక్షన్ అంటూ క్యాప్షన్ ఇచ్చి ఫోటో షేర్ చేశారు. ఆ పిక్ లో వరుణ్.. ఓ రేంజ్ లో ఉన్నారు. బ్లాక్ కలర్ షర్ట్.. సింపుల్ గ్లాసెస్.. కర్లీ హెయిర్.. అలా వరుణ్ చాలా హ్యాండ్సమ్ గా కనిపిస్తున్నారు. ఇక ఇప్పుడు వరుణ్ పిక్ సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతోంది. సూపర్బ్ అన్నా అంటూ ఫ్యాన్స్ కామెంట్లు పెడుతున్నారు. మరికొందరు లావణ్య ఎక్కడ అని క్వశ్చన్ చేస్తున్నారు. అయితే హీరోయిన్ లావణ్య త్రిపాఠిని వరుణ్ ప్రేమించి గత ఏడాది పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. ఇటలీలో వీరి వివాహ వేడుక గ్రాండ్‌గా జరిగింది. ఇటీవల ఇద్దరూ వెకేషన్ కు వెళ్లినట్లు లావణ్య పోస్ట్ చేసింది. మళ్లీ ఇప్పుడు ఇద్దరూ వెళ్లారా లేక వరుణ్ ఒక్కరే వెళ్లారా అన్నది చూడాలి.

## ఎన్టీఆర్ - రష్మిక.. ఫ్యాన్స్‌కి బిగ్ సర్‌ప్రైజ్



ఎన్టీఆర్ ప్రస్తుతం దేవర సినిమాలో జాన్వీ కపూర్‌తో రొమాన్స్ చేస్తున్న విషయం తెల్సిందే. మరో వైపు హిందీలో నటిస్తున్న వార్ సినిమాలో ఎన్టీఆర్ కు జోడీగా ఒక బాలీవుడ్ హీరోయిన్ నటించబోతుంది అనే వార్తలు వస్తున్నాయి. ఆ విషయమై మరింత స్పష్టత రావాల్సి ఉంది. ఈ రెండు సినిమాలతో పాటు ఎన్టీఆర్ చేయబోతున్న తదుపరి సినిమా గురించి ప్రధానంగా చర్చ జరుగుతోంది. దేవర సినిమా షూటింగ్ ముగియడమే ఆలస్యం వెంటనే ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో సినిమాకు ఎన్టీఆర్ జాయిన్ అవ్వబోతున్నాడు అంటూ గత కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. ఇటీవల ఎన్టీఆర్ పుట్టిన రోజు సందర్భంగా ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబో మూవీని ఈ ఏడాదిలోనే మొదలు పెట్టబోతున్నట్లుగా మైత్రి మూవీ మేకర్స్ వారు అధికారికంగా ప్రకటించారు. ఒక వైపు సలార్ 2 పనిలో ఉన్న దర్శకుడు ప్రశాంత్ నీల్ మరో వైపు ఎన్టీఆర్ తో 'డ్రాగన్' అనే భారీ యాక్షన్ సినిమాకు సంబంధించిన వర్క్ లో బిజీగా ఉన్నాడు. ఎన్టీఆర్ కి జోడీగా ఈ సినిమాలో నేషనల్ క్రష్ రష్మిక మందన్న నటించే అవకాశాలు ఉన్నాయి అంటూ వార్తలు వస్తున్నాయి. యానిమల్ సినిమా తర్వాత పాన్ ఇండియా రేంజ్ లో ముద్దుగుమ్మ రష్మిక మందన్న కి మంచి క్రేజ్ దక్కింది. అందుకే డ్రాగన్ లో ఆమెను తీసుకోవాలని ప్రశాంత్ నీల్ భావిస్తున్నాడట. పుష్ప 2 సినిమాలో నటిస్తున్న రష్మిక మందన్న మరో వైపు వరుసగా లేడీ ఓరియంటెడ్ సినిమాలు అయిన రెయిన్ బో మరియు గాళ్ ఫ్రెండ్ సినిమాలను చేస్తుంది. ఇవే కాకుండా విజయ్ దేవరకొండ తో కలిసి ఒక సినిమాలో రష్మిక మందన్న నటించేందుకు ఓకే చెప్పిందని తెలుస్తోంది. ఎన్టీఆర్ మరియు రష్మిక మందన్న ల అభిమానులు చాలా కాలంగా ఈ కాంబో కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు సినిమా కు సంబంధించిన వార్తలు రావడంతో వారి ఆనందానికి అవధులు లేవు అనడంలో సందేహం లేదు. హీరోయిన్ గా రష్మిక మందన్న కచ్చితంగా ఎన్టీఆర్ కి సరి జోడీ అంటూ అప్పుడే ఫ్యాన్స్ లో చర్చ మొదలు అయ్యింది.

# మూడు రోజుల ముందే ఏర్పాట్లు పూర్తికావాలి



**విజయనగరం:** ఓట్ల లెక్కింపు కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఆదేశించారు. లెక్కింపు ప్రక్రియ నిర్వహణ కోసం చేయాల్సిన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం సమీక్షించారు. ఆయా శాఖల వారీగా చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు.

ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా, సకాలంలో పూర్తి చేసే విధంగా అన్ని వసతులతో ఎక్కింపు కేంద్రాలను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. లెండి కళాశాలలో చీపురుపల్లి, గజపతినగరం, రాజాం, నెల్లిమర్ల, ఎస్.కోట అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్లు లెక్కింపు జరుగుతుందని, జెఎన్‌టియు గురజాడ విశ్వవిద్యాలయంలో విజయనగరం, బొబ్బిలి నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు జరుగుతుందని తెలిపారు. లెండి కళాశాల లెక్కింపు కేంద్రాలనికి మెప్మా పిడి సుధాకరరావు, హౌసింగ్ పిడి శ్రీనివాసరావు, జెఎన్‌టియు కేంద్రానికి డిప్యుటీ సిఇఓ రాజ్‌కుమార్, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి సుధారాణి ఇన్‌ఛార్జులుగా ఉంటారని తెలిపారు. ఏర్పాట్లను వీరు పర్యవేక్షించాలని ఆదేశించారు. లెండి కళాశాలలో ఆర్ అండ్ బి, జెఎన్‌టియులో పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ శాఖలు ఏర్పాట్లు చేస్తాయన్నారు. జూన్ 4వ తేదీ ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని, మూడు రోజులు ముందుగానే లెక్కింపు గదుల్లో ఏర్పాట్లు పూర్తి చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఆ రోజు ఉదయం 6 గంటలకే సిబ్బంది ఆయా కేంద్రాలకు చేరుకుంటారని, వారికి చక్కని అల్పాహారం, భోజన సదుపాయాలను కల్పించాలని ఆదేశించారు. సిబ్బంది గానీ, ఏజెంట్లు గానీ తమకు కేటాయించిన నియోజకవర్గాలకు, కౌంటింగ్ హాళ్లకు సులువుగా చేరుకొనే విధంగా సైన్ బోర్డులు, డైరెక్షన్ బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు.

ఓట్ల లెక్కింపు కేంద్రాలవద్ద పటిష్టమైన బారికేడింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. అలాగే ప్రతీ గదిలో తగినంత వెలుతురు ఉండేలా లైటింగ్, ఫ్యాన్లు, కూలర్లు, ఫర్నీచర్ ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని, జెనరేటర్‌ను కూడా సిద్ధంగా ఉంచాలని చెప్పారు. సిబ్బంది, ఏజెంట్లు లోపలికి వెళ్లి రావడానికి వీలుగా బారికేడింగ్, మెష్‌ల ద్వారా వేర్వేరు మార్గాలను ఏర్పాటు చేయాలని సూచించారు. రెండు చోట్లా వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడమే కాకుండా, ఒక్కో అంబులెన్సును కూడా సిద్ధంగా ఉంచాలని చెప్పారు. అగ్నిమాపక శకటాలను కూడా సిద్ధంగా ఉంచాలన్నారు. లెక్కింపు ప్రక్రియ రాత్రి వరకూ కొనసాగితే, ఇబ్బంది పడకుండా బయటా, వెలుపలా తగిన లైటింగ్‌ను ఏర్పాటు చేయాలని చెప్పారు. సిబ్బందికి, ఏజెంట్లకు వేర్వేరుగా పార్కింగ్ ప్రదేశాలను నిర్ణయించాలని సూచించారు. బయట ఎండ తగలకుండా అవసరమైన అన్నిచోట్లా టెంట్లు, కుర్చీలు వేయాలని, త్రాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాన్ని కల్పించాలని చెప్పారు. ఏజెంట్లు నగదు చెల్లించి తీసుకొనే విధంగా భోజన కౌంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. పాత్రికేయుల కోసం రెండు చోట్లా రెండు మీడియా సెంటర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితిలోనూ లెక్కింపు కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబోమని స్పష్టం చేశారు. వీటిని డిపాజిట్ చేయడానికి ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. అవసరమైనప్పుడు తమవారికి సమాచారం అందించేందుకు పబ్లిక్ కమ్యూనికేషన్ గదులను ఏర్పాటు చేయాలని, అక్కడ మాత్రమే సెల్‌ఫోన్‌లో మాట్లాడటానికి అనుమతి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఈ సమీక్షా సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్‌ఓ ఎస్‌డి అనిత, వివిధ విభాగాల నోడల్ అధికారులు, వేదికల ఇన్‌ఛార్జులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# స్ట్రాంగ్ రూమ్లను, కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్రా యూనివర్శిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈవీఎం స్ట్రాంగ్ రూమ్లను, కౌంటింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.ఎ. మల్లికార్జున శుక్రవారం మధ్యాహ్నం పరిశీలించారు. పోలీసు కమిషనర్‌డా. ఎ. రవిశంకర్, జాయింట్ కమిషనర్ ఫక్కీరప్ప, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్‌లతో కలిసి పార్లమెంటు, అంసెబ్లీ ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్లను తనిఖీ చేసిన ఆయన అక్కడ పరిస్థితులను గమనించారు. భద్రతాపరమైన చర్యలను పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరు, మానిటరింగ్ రూమ్ ద్వారా పర్యవేక్షణ గురించి అక్కడ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో జూన్ 04వ తేదీన జరగనున్న కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అన్ని రకాల భద్రతా ప్రమాణాలను పాటిస్తూ కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పనులను వేగవంతం చేయాలని సూచించారు. ప్రక్రియ నిర్వహణలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు వహిస్తూ ఈ మేరకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అనంతరం మీడియా ఫెసిలిటేషన్ కేంద్రాన్ని సందర్శించి అక్కడ పరిస్థితిని గమనించారు. ఆయా నియోజకవర్గాల ఆర్వోలు, ఇతర అధికారులు సిబ్బంది వారి వెంట ఉన్నారు.


# వైజాగ్‌లో డర్టీ ఫెలో చిత్రం . సక్సెస్ మీట్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** శాంతి చంద్ర, సిమ్రితి భతిజ. దీపిక సింగ్, హీరో హీరోయిన్లుగా, పూజా విశ్వేస్, కుమ్నన్, పొట్టి మూర్తి. ఎఫ్ఎం బాబాయ్. నాగినీడు సత్య ప్రకాష్, రామన్ ప్రధాన పాత్రధారులుగా, ఆడారి మూర్తి దర్శకత్వంలో, రాజ్ ఇండియా ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై, ప్రతిష్టాత్మకంగా నిర్మించిన చిత్రం డర్టీ ఫెలో. ఈ చిత్రం ఉభయ రాష్ట్రాల్లో ఈరోజే విడుదలై అఖండ ప్రేక్షకాదరణ పొందింది,. ఈ సందర్భంగా ఈ చిత్రములో నటించినా నగర సినీ కళాకారులు. స్థానిక గాజువాక మోహిని థియేటర్లో. ప్రేక్షకులను కలుసుకొని కృతజ్ఞతలు తెలియజేశారు. తమ చిత్రం విజయం సాధించాలని, ఆకాంక్షించారు . ముందుగా పూజ విశ్వేస్ మాట్లాడుతూ ఫ్యాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం ఆడాలని. ఇదివరకు ఎన్నో చిత్రాలు నటించిన. సలార్లో మంచి పేరు వచ్చిన. ఈ చిత్రంలో తనకు డ్రీమ్ రోల్ లభించిందని .అభిప్రాయపడ్డారు, పొట్టి మూర్తి మాట్లాడుతూ. ఈ చిత్రంలో తనకు ఎమ్మెల్యే క్యారెక్టర్ . చేశానని చిత్రాలలో నటించిన ఈ చిత్రంలో పాత్రకు ప్రాధాన్యత ఉన్న పాత్ర లభించిందని ఆడారి మూర్తి గారికి కృతజ్ఞతలు అని తెలియజేశారు. సీనియర్ సినీ ఆర్టిస్ట్ బాబు దేవ్ మాట్లాడుతూ... ఈ మధ్యలో విడుదలైన చిత్రాల్లో చక్కటి చిత్రం అందించారని. హీరో మరియు ప్రొడ్యూసర్ అయిన శాంతి చంద్ర మరియు ఆడారి మూర్తి గారు , తనకు చిరకాల మిత్రులని . చిత్రంలోని తాను నటించకపోయినా. అమితంగా ఆకర్షింపబడ్డానని, సతీష్ కుమార్ అద్భుతమైన సంగీతాన్ని అందించారని, మూడు పాటలు వరకు ఆయనే రాసారని ' తెలియజేశారు. ప్రతి సన్నివేశాన్ని ప్రతి ఫ్రేమ్ ని అందంగా చూపించడం కెమెరామెన్ రామకృష్ణ కే చెందుతుందని తెలియజేశారు ఇంకా ఈ కార్యక్రమంలో సినీ ప్యాడింగ్ ఆర్టిస్ట్ మరియు డైరెక్టర్. ప్రసన్నకుమార్ తదితరులు హాజరయ్యారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రం అధిక రాబడులు ఓపెనింగ్ తో ప్రారంభం అయిందని చిత్ర వర్గాలు తెలియజేశాయి.

# గీతం ప్రవేశపరీక్ష 'గ్యాట్' నిర్వహణ

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్, ఫార్మశీ, ఆర్కిటెక్చర్, మేనేజ్‌మెంట్, సైన్స్, లా, నర్సింగ్, పారామెడికల్ కోర్సులలో ప్రవేశానికి నిర్వహిస్తున్న ఉమ్మడి ప్రవేశ పరీక్ష గీతం అడ్మిషన్ టెస్టు (గ్యాట్-2024) ను ఆదివారం తేది: 26-05-2024న దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన పట్టణాలలో ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తున్నారు. ప్రవేశ పరీక్షలో లభించిన మార్కుల ఆధారంగా వివిధ కోర్సులలో ప్రవేశాలు కల్పిస్తారు. ప్రతిభగల విద్యార్థులను పెద్దఎత్తున ప్రోత్సహించడానికి విద్యార్థులకు ప్రతిభ స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నట్లు ఈ సందర్భంగా రిజిస్ట్రార్ వెల్లడించారు. క్రీడలలో ప్రతిభ కనబరిచిన వారికి గీతం ప్రవేశాలలో ప్రాధాన్యతతో పాటు స్కాలర్‌షిప్ అందచేస్తున్నామని తెలిపారు. గీతం విద్యార్థులలో నైపుణ్యం పెంచడంతో పాటు ఉద్యోగ అవకాశాలను మెరుగు పరచడానికి, విదేశీ విద్య అవకాశాలను పెంచుకోవడానికి, పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి తగిన శిక్షణ అందించేందుకు గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్‌ను (జిసిజిసి)ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసినట్లు రిజిస్ట్రార్ తెలిపారు. కాగా ఈ ఏడాది గీతంలో ప్రవేశాలకు అనూహ్య స్పందన లభించింది.






VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 9949413661, Parawada : Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, Araku : Cell: 94401 84106,
Office : 99487 49799. Arilova : 73825 85777 Maddilapalem : 99084 24231, Yelamanchili : 9441356676